

మిర్చికి.. కూలి ఘాటు

- క్వింటాల్ రూ.10 వేలు.. కూలి రూ.6 వేలు
- పంట అమ్మగా వచ్చినదాంట్లో సగం కూలి ఖర్చు
- కర్నూలు కూలీలు రాకపోవడంతో పెరిగిన రేట్లు
- ఎకరాకు సాగు ఖర్చు రూ.1.50 లక్షల నుంచి రూ.2.20 లక్షలు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులపై ఏదో ఒకవిధంగా దెబ్బ పడుతూనే ఉంది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతులపై పెరిగిన కూలి రేట్ల కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డులో డీలక్స్ రకాలు క్వింటాల్‌కు రూ.9 వేల నుంచి రూ.10 వేలు మాత్రమే పలుకుతున్నాయి. తేజ రకం మాత్రం రూ.11 వేల నుంచి రూ.13 వరకు పలుకుతోంది. అయితే ఒక కేజీ మిరప కాయలు కోసినందుకు రూ.16 వరకు కూలి తీసుకుంటున్నారు. మూడు కేజీలు పండు మిరపకాయలు కోస్తే అవి ఎండేటప్పటికి ఒక కేజీ అవుతున్నాయి. ఈ లెక్కన ఒక కేజీ ఎండు మిరప కాయల కోత కూలీ రూ.48 వరకు అవుతుంది. కొన్ని చోట్ల రోజు కూలి చొప్పున కోతలు కోస్తున్నారు. రోజుకు కూలి రూ.470 వరకు చెల్లిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కోత కోస్తే ఈ కూలి ఇస్తారు. తాలుకాయలు (తెల్లకాయలు) ఏరినందుకు రోజుకు రూ.600 వరకు చెల్లిస్తున్నారు. రైతులు చెబుతున్న లెక్క ప్రకారం ఒక క్వింటాల్ మిర్చి కోతకు 12 మంది కూలీలు అవసరం. ఈ లెక్కన క్వింటాల్‌కు కూలి రూ.6 వేలకు తక్కువ కావడం లేదని తెలుస్తోంది.

వలస కూలీలు రాకే..

వాస్తవానికి కర్నూలు నుంచి మిర్చి కోతల కోసం ప్రతి ఏటా పెద్దసంఖ్యలో కూలీలు వలస వచ్చే వారు. అయితే ఈ ఏడాది వలస వచ్చేందుకు అక్కడి కూలీలు ఇష్ట పడటంలేదు. అక్కడే మిర్చి కోతలు ఎక్కువగా ఉండటం, కూలి కూడా రోజుకు రూ.250 వరకు పడుతుండటంతో చాలామంది ఇటువైపునకు రాలేదు. దానివల్ల మిర్చి సీజన్‌లో కూలీల కొరత ఏర్పడింది. స్థానికంగా ఉన్న కూలీలకు బాగా డిమాండ్ వచ్చింది. స్థానికులు రూ.470కి తక్కువ ఇస్తే కోతకు రామని ముందే చెబుతున్నారు ప్రస్తుతం ఉన్న మిర్చి ధరల ప్రకారం పండిన పంటలో సగ భాగం కూలి ఖర్చులకు పోతుండగా, సగం మాత్రమే రైతులకు పెట్టుబడి, లాభాల కింద మిగులుతుంది.

మిర్చి సాగు.. మంట పుట్టిస్తోంది. ఒకవైపు ధర లేక రైతులు అల్లాడుతుంటే.. మరోవైపు అమాం తం పెరిగిన కూలి రేట్లు కోలుకోలేని విధంగా నష్ట పరుస్తున్నాయి. తెగుళ్ల తో దిగుబడులు తగ్గిపోగా వాటిని అమ్ముకు నేందుకు సతమతం అవుతు న్నారు. అరకొరగా వచ్చిన పంటను కోసేందుకు సిద్ధమవగా కూలీలు దొరక్క.. ఉన్న కూలీలు అమాం తం కూలి రేట్లు పెంచేయడంతో ఏమి చేయాలో పాలు పోని పరిస్థితుల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి క్వింటాల్ రూ.6 వేలు ఉండగా.. ఎకరా కోత కూలి ఖర్చు రూ.10 వేలు వరకు వెచ్చిం చాల్సి వస్తోం ది. ఒకవైపు సాగు ఖర్చు లు పెరిగిపోగా కోతలో సగ భాగం కూలి ఖర్చులకే పోతోందని కన్నీటి పర్యంతమవు తున్నారు. ఈ ఏడు హఠాత్తుగా పెరిగిన కూలి రేట్లు మిర్చి రైతులను పాతాళంలో పడేస్తున్నాయి.

ఎకరాకు రూ.లక్ష నష్టం..

ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలోని రైతులు పెట్టుబడి కింద పెద్దమొత్తంలో వ్యయం చేశారు. ప్రకాశం జిల్లాలో పెట్టుబడి కింద ఎకరాకు రూ.1.50 లక్షలు వరకు వెచ్చించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎకరాకు పెట్టుబడి రూ.1.80 లక్షల నుంచి రూ.2.20 లక్షల వరకు ఖర్చు అయినట్లు రైతులు తెలిపారు. కౌలు రేట్లు ఎక్కువ కావడం, నల్లి తెగులు బెడదతో పెట్టుబడులు పెరిగిపో యాయి. ఈ లెక్కన మిర్చి పంట అమ్మగా వచ్చినదాంట్లో సగం కూలి ఖర్చు అవుతుంటే రైతుకు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు తక్కువలో తక్కువ నష్టం వస్తుందని తెలుస్తోంది.

కూలీలు తక్కువగా వచ్చారు



ప్రతి ఏటా కర్నూలు నుంచి కూలీలు ఎక్కువ సంఖ్యలో వస్తే ఇంత ఇబ్బంది ఉండేది కాదు.కూలి రేటు బాగా పెరిగింది. రోజుకు రూ.400 కూలి, ఆటో ఖర్చు రూ.50 వ రకు ఖర్చైంది. క్వింటాల్ మిర్చి అమ్మితే వచ్చిన దాంట్లో సగం కూలికే ఖర్చయితే రైతుకు మిగిలేది ఏమిటి.

హనుమంతరావు, తాళ్లచెరువు, పల్నాడు జిల్లా

నిండా మునిగినట్లే..



మిర్చి ఎందుకు వేశామో అర్థం కావడం లేదు. రైతుకు మిగిలేది ఏమి లేదు. ఇక్కడ రేటు చూస్తే చాలా తక్కువ ఉంది. అక్కడ కూలీల రేటు ఆకా శాన్ని అంటింది. వచ్చిన దాంట్లో సగం కూలీలకు పోతుంటే ఇక మాకు మిగిలేదేమిటి. ఈ ఏడాది నిండా మునిగినట్లే.

- దళారి వెంకట నర్సయ్య, వాదం పల్లె, యర్రగొండ పాలెం

ఉన్నది అమ్మి అప్పు కట్టాలి



ఈ ఏడు మా పని అయిపోంది. ఏదో రేటు వస్తుందని మిర్చి వేస్తే వేసిన రోజు నుంచి నిద్ర పోయింది లేదు. ఎప్పుడూ ఏదో ఒక సమస్య. పంటను గుంటూరు యార్డుకు తీసుకురావడానికి మేము పడిన కష్టం పగవాడికి కూడా రాకూడదు. కూలి రేటు చూస్తే గుం డెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. సగం కూలికే పోతే ఇక మందులు కొట్టేందుకి ఏమి ఇవ్వాలి. ఉన్నది అమ్మి కట్టాల్సిందే.

- బాదరయ్య, గంగాపాలెం, యర్రగొండపాలెం



గృహ ప్రవేశాల పండగ..!

- సామూహిక ప్రారంభానికి అధికారులు చర్యలు
- 11,814 గృహ ప్రవేశాలే లక్ష్యం



నరసరావుపేటలో పూర్తయిన గృహాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పేదలందరికీ ఇళ్లు కట్టిస్తాం.. ఇళ్లు కాదు ఊళ్లే నిర్మిస్తాం.. అంటూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగలేదు. కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ విఫలమయింది. చాలా చోట్ల ఇళ్ల నిర్మాణం పునాదుల స్థాయి దాటలేదు. వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం నిలిచిపోయింది. ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను కూడా దారి మళ్లించి లబ్ధిదారులకు మొండిచేయి చూపింది. పేదల సొంతింటి కల నెరవేర్చడంతో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాలను పట్టాలెక్కించింది. పనులను వేగవంతం చేసింది. వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసింది. పేదల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది.

వైసీపీ ప్రభుత్వంలో నత్తనడకన సాగిన ఇళ్ల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. గృహాల నిర్మాణం పూర్తికి జిల్లాల వారీగా అధికారులకు నెల వారీగా లక్ష్యాలను నిర్దేశించింది. పల్నాడు జిల్లాలో 4,870 గృహాలు, బాపట్ల జిల్లాలో 2,402, గుంటూరు జిల్లాలో 4,542 ఇళ్లలో గృహప్రవేశాలు లబ్ధిదారుల చేత చేయించాలని ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖకు లక్ష్యాలను నిర్దేశించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ నెలలో జరగాల్సిన గృహ ప్రవేశాలను వాయిదా వేసింది. మార్చిలో సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేర కు జిల్లాల వారీగా ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. లక్ష్యాల మేర ఇళ్ల నిర్మాణాలను గృహనిర్మాణ శాఖ పూర్తి చేసింది. పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో 11,814 గృహాలను పూర్తి చేసినట్లు ఆ శాఖ గణాంకాలు తెలియ జేస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ 8 వరకు ఉండ టంతో ఆ తదుపరి గృహప్రవేశాలకు మంచి ముహూ ర్తాన్ని ఖరారు చేయనున్నారు.

మార్చి నెలాఖరుకు 12,392 గృహాల నిర్మాణం

ఒక వైపు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించడంతో పాటు మూడు జిల్లాల్లో మార్చి నెలాఖరు కల్లా 12,392 గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు టార్గెట్‌లు ఇచ్చింది. ఈ మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తికి అధికారులు చర్యలు చేపట్టారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేశారు. మార్చి నెలాఖరుకు పల్నాడు జిల్లాలో 3,143 ఇళ్ల పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. బాపట్ల జిల్లాలో 4,898, గుంటూరు జిల్లాలో 4,359 ఇళ్ల పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులతో చర్చలు జరిపి ఇంటి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేస్తున్నారు. గృహ నిర్మాణ శాఖ ఉన్న తాధికారులు క్షేత్ర స్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

విచ్చలవిడి వినియోగం

- ఎరువుల వాడకంపై ఆలకించని రైతులు
- రబీ మొత్తానికి వాడాల్సినవి జనవరికే పూర్తి
- ఎకరాకు 8 కట్టలకుపైగా యూరియా.. మోతాదుకు మించి డీఏపీ
- పంజాబ్ తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఎక్కువ వాడకం



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): రసాయన ఎరువులు.. మేలు చేయవు. కాలుష్యాలను వెదజల్లుతున్నాయి.. పంటకు నష్టం.. భూమి నిస్సారం.. అని వ్యవసాయశాస్త్రవేత్తలు, ప్రభుత్వం హెచ్చరిస్తోంది. అయినా రైతులు ఆ మాటలను ఆలకించడంలేదు. దిగుబడి పెరుగుతుందనే అపోహతో విచ్చలవిడిగా ఎరువులను వినియోగిస్తున్నారు. గుంటూరు జిల్లాలో రబీ సీజన్ మొత్తానికి 70,826 మెట్రిక్ టన్నుల యూరియా, 19,225 మెట్రిక్ టన్నుల డీఏపీ, 3322 మెట్రిక్ టన్నుల పొటాష్ వాడాలి. కానీ రైతులు నిర్దేశించిన ఎరువుల నిల్వలన్నీ జనవరిలోనే ఖాళీ చేసేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పంజాబ్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే యూరియా, ఇతర ఎరువుల వాడకం ఎక్కువగా ఉందని కేంద్రం హెచ్చరించింది. అయినా పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడంలేదు. ఈ విధానంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. చాలా చోట్ల ఎకరాకు 8 కట్టలకు పైగా యూరియా వాడినట్లు తేలింది. డీఏపీ, పొటాష్ వాడకం కూడా అంతే ఉంది. ఎక్కువ తింటే ఏమౌతుంది? భుక్తాయాసం వస్తుంది.. భూమి పరిస్థితి కూడా అంతేనని హెచ్చరిస్తున్నా రైతులు మేలుకోవడంలేదు. ఎరువులు ఎక్కువ వాడకం వల్ల భూమి సహజతత్వం కోల్పోతోందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా అన్నదాతలు ఆలకించడంలేదు. ఎరువుల వాడకంపై వ్యవసాయ శాఖ ప్రతి సీజన్‌లో ప్రత్యేకంగా కరపత్రాలు ముద్రించి రైతులకు తగిన సూచనలు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు.

అపోహలతో.. నష్టం

ఎరువులు ఎక్కువ వాడితే భూమికి బలం పెరిగి దిగుబడి పెరుగుతుందని రైతుల భావన. నత్రజని పోషకంతో ఉండే యూరియా రసాయన ఎరువు వేస్తే పైరు ఏపుగా పెరిగి అధిక దిగుబడి వస్తుందనే అపోహ రైతుల్లో ఉంది. దానివల్ల సీజన్‌తో సంబంధం లేకుండా ఎరువులను ఎక్కువగా చల్లేస్తున్నారు. ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల భూమి నిస్సారం అవుతుందని, దీర్ఘకాలం తర్వాత ఈ నష్టం కనిపిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉదాహరణకు.. భాస్వరం పోషకాన్ని పంటలకు ఇచ్చేందుకు డై అమ్మోనియం పాస్ఫేట్(డీఏపీ) పేరుతో మార్కెట్లో రసాయన ఎరువులను విక్రయిస్తున్నారు. ఎరువులను నిరంతరం ఉపయోగించడం వల్ల నేల పీహెచ్ విలువ మారుతుందని, పైరు తెగుళ్ల బారిన పడే అవకాశం పెరుగుతుందని వ్యవసాయశాఖ చెబుతోంది. రసాయన ఎరువుల అధిక వినియోగం నేల ఆమ్లీకరణను వేగవంతం చేస్తుందని, నేలపై పొరలోనూ మార్పులు వస్తాయని చెబుతున్నారు. రైతులు తమ పొలాలకు వినియోగించే రెండు ప్రధాన ఎరువులు నత్రజని, భాస్వరం. పరిశోధన ప్రకారం పంటలపై ఉపయోగించే నత్రజనిలో దాదాపు మూడింట రెండు వంతులు కాలుష్య కారకంగా మారుతున్నట్లు తెలుస్తోంది. దానివల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందని చెబుతున్నారు.

అవసరానికి మించి భాస్వరం

భాస్వరం రసాయన ఎరువు వినియోగం ఏకంగా 36 శాతం పెరిగినట్లు అధ్యయనంలో గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో భూసార పరీక్షలు చేస్తే నేలలో అవసరానికి మించి భాస్వరం ఉన్నట్లు తేలింది. ఇది ఎక్కువగా ఉంటే డీఏపీ ఎరువును పెద్దగా వాడాల్సిన అవసరం ఉండదు. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో డీఏపీ ఎక్కువగా చల్లుతున్నారు.

సిఫార్సులను బట్టే చల్లాలి..

ఎరువుల వాడకంలో రైతుల్లో కొన్ని అపోహలు ఉన్నట్లు వ్యవసాయశాఖ గుర్తించింది. రైతులందరూ మొదటి సారి డీఏపీ వేయాలనే అపోహతో ఉంటున్నట్లు తెలుస్తోంది. పోషకాలను ఇతర కాంప్లెక్స్ ఎరువుల రూపంలో కూడా మోతాదును లెక్క కట్టి వేసినా పంట ఎదుగుదల, దిగుబడిలో

(మిగతా 8వ పేజీలో)

మండలి బరిలో.. 30 మంది

- ఎమ్మెల్సీ నామినేషన్ల పరిశీలన పూర్తి
- 10 మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ




కలెక్టరేట్‌లో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్‌వో నాగలక్ష్మి, అబ్జర్వర్ కరుణ

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి అయింది. మొత్తం 40 మంది అభ్యర్థులకు చెందిన 69 నామినేషన్లను పరిశీలించారు. 10 మంది అభ్యర్థుల నామినేషన్లను వేర్వేరు కారణాలతో తిరస్కరించారు. అన్ని సవ్యంగా ఉన్న 30 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమో దిస్తున్నట్లు ఆర్‌వో నాగలక్ష్మి ప్రకటించారు. మంగళవారం గుంటూరు కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ జరిగింది. ఈ కార్యక్రమానికి అబ్జర్వర్ వీ కరుణ హాజరయ్యారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరఫున హాజరైన ఎన్నికల ఏజెంట్ సతీష్ గవిని ఒక అభ్యంతరాన్ని లేవనెత్తారు. నాన్ జ్యూడీషియల్ స్టాంపు పేపర్‌పై అఫిడవిట్లు సమర్పించని అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించాలని కోరారు. ఆ అభ్యంతరాన్ని ఆర్‌వో తిరస్కరించారు. ఇదే రీతిన అంబాల రాజకుమార్ అనే అభ్యర్థి ఓటర్ల జాబితాలో 9 మంది ప్రతిపాదన చేసి వారి పేర్లు సరిపోయినా నామినేషన్ ఆమోదించాలన్నారు. దీనిని కూడా తిరస్కరిస్తున్నట్లు ఆర్‌వో ప్రకటించారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నాలుగు నామినేషన్లు దాఖలు చేయగా అన్నింటిని ఆమోదించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మూడు నామినేషన్లు వేయగా ఆమోదించారు. టీడీపీ జారీ చేసి బీ ఫారంలో ప్రధాన అభ్యర్థిగా రాజేంద్రప్రసాద్ పేరు ఉండటంతో ఆయన సతీమణి మాధవి దాఖలు చేసిన రెండు నామినేషన్లను తిరస్కరించారు. వీరితో పాటు (మిగతా 8వ పేజీలో)

పారిశ్రామిక వృద్ధిని పెంచాలి

- విశ్వకర్మ యోజన పథకం కింద 335 యూనిట్లకు రుణాలు
- కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా లో పారిశ్రామిక వృద్ధిని పెంచాలని, ఇందుకు పరిశ్రమల శాఖ కృషి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. విశ్వకర్మ యోజన పథకం కింద 334 యూనిట్లకు రుణాలు విడుదల చేయడం జరిగిందని చెప్పారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సా హక కమిటీ సమావేశంలో అయన మాట్లాడుతూ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి విధా నం 2023-27, ప్రధాన మంత్రి ఉపాధి హామీ పథకం, సూక్ష్మ చిన్న సంస్థలు, క్లస్టర్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్, జిల్లాలో పారిశ్రామిక పార్కుల్లో ప్లాట్ల కేటాయింపు తదితర పథకాల కింద ప్రోత్సాహకాలను, ఆర్థిక సాయం అందించి పారిశ్రామిక వృద్ధిని పెంచాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ అనుమతుల పురోగతి గురించి చర్చిస్తూ ఈ నెలలో 186 దరఖాస్తులకు గాను 172 ఆమోదించామన్నారు. ప్రధానమంత్రి విశ్వ కర్మ యోజన పథకం కింద ఇప్పటివరకు 4028 మందికి శిక్షణ ఇవ్వగా 3357మంది దరఖాస్తులను బ్యాంక్‌లకు పంపగా వీటిలో 414 మంజూరు కాగా 335 యూనిట్లకు రుణాలు విడులైనట్లు వివరించా రు. ప్రధానమంత్రి ఉపాధి హామీ పథకానికి సంబంధించి కేవీఐసీ ద్వారా దరఖాస్తుల ప్రాసెస్ వేగవంతంగా ఉండాలని కోరారు. బ్యాంకు అధికారులు అనుమతి, రుణాల విడుదల ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. ఎంఎస్ఎం ఈ సర్వేను ఎంపీడీవోలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ క్లియరెన్స్, ఎస్సీ/ఎస్టీ లబ్ధిదారులకు పెట్టుబడి రాయితీ, పారిశ్రామిక అభివృద్ధి విధానంలోని రాయితీ పథకం, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం, సులభతర వ్యాపారం, సూక్ష్మ చిన్న సంస్థలు-క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ వంటి పలు అజెండాలపై చర్చించి, వివిధ అంశాలపై కమిటీ నిర్ణయాలు తీసుకుంది. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ టాపర్.. సాయిమనోజ్ఞ



సాయిమనోజ్ఞకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు పద్మజ, కిశోర్ చౌదరి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాల్లో గుంటూరు జేకేసీ రోడ్డు ప్రాంతానికి చెందిన విద్యార్థిని గుత్తికొండ సాయిమనోజ్ఞ అగ్రస్థానంలో నిలిచింది. తల్లి పద్మజ గృహిణికాగా, తండ్రి కిశోర్‌చౌదరి ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్. కాగా పదో తరగతి వరకు గుంటూరులోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో సాయిమనోజ్ఞ చదివింది. ఇక ఇంటర్ విద్య భాష్యంలో సాగింది. కాగా ఇటీవల జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలు రాసిన మనోజ్ఞ జాతీయ స్థాయిలో నూరుశాతం పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరిలో టాపర్‌గా నిలిచింది. టాపర్‌గా తమ కుమార్తె నిలవడంతో తల్లిదండ్రులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. కాగా భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేతరామ్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆనంద్ తదితరులు సాయిమనోజ్ఞను ప్రత్యేకంగా అభినందించారు.

ఐఐటీలో ఈసీఈ సీటు సాధిస్తా

ప్రణాళికబద్ధంగా చేసిన కృషి, సమయ పాలన, తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల ప్రోత్సాహంతో జేఈ ఈలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన ట్లు సాయిమనోజ్ఞ తెలిపారు. రోజుకు కనీసం 12 గంటలు చదివినట్లు చెప్పారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవడం వల్లే అత్యుత్తమ ర్యాంకు సాధ్యమైందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే భాష్యం సంస్థలు అమలు చేసే కరిక్యులం టాపర్‌గా నిలవడానికి దోహదపడిందన్నారు. ఒత్తిడిని అధిగమించడానికి స్ఫూర్తిప్రదాతలతో చైర్మన్ రామకృష్ణ, కోఆర్డినేటర్ ఆనంద్ కౌన్సిలింగ్ ఇప్పించారని తెలిపారు. అడ్వాన్స్ పరీక్షకు సన్నద్ధమౌతున్నానని, పతిష్టాత్మక ఐఐటీలో ఈసీఈ బ్రాంచిలో సీటు సాధించడమే లక్ష్యమని విద్యార్థిని తెలిపారు.

డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జ్ పీడీగా హీరాలాల్



- పీడీ బాలు నాయక్‌పై అవినీతి ఆరోపణలు
- విచారణాధికారిగా జేసీ సూరజ్
- ప్రభుత్వానికి బాలు నాయక్ సరెండర్

నరసరావుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జ్ పీడీగా హీరాలాల్ నాయక్ నియమితులయ్యారు. మంగళవారం అయన విధుల్లో చేరారు. ఇక్కడ పీడీగా పనిచేస్తున్న బాలు నాయక్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ డీఆర్‌వో మురళీ ఉత్తర్వులు జారీ చేశారు. వెలుగు రుణాల మం జూరులో అవకతవకలకు పాల్పడినట్టు బాలు నాయక్‌పై ఆరోపణల నేపథ్యంలో అయనపై చర్యలు తీసుకున్నారు. అమరావతి, అచ్చంపేట, గురజాల తదతర మండలాల్లో వెలుగు రుణాలు.. మహిళా మార్టుల్లో అవినీతికి పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకొకపోగా వారికి అండగా ఉన్నారన్న ఆరోపణలను బాలు నాయక్‌పై ఉన్నాయి. వెలుగు రుణాల్లో దాదాపు కోటి రూపాయల మేర అవినీతి జరిగిందని, దానిపై విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా జేసీ సూరజ్‌ను నియమించారు. అవినీతి ఆరోపణలతో పాటు సిబ్బందిని వేధింపుకు గురి చేసినట్టుగా కూడా బాలూ నాయక్‌పై ఫిర్యాదులున్నా యి. వీటిన్నిటిపై జేసీ నేతృత్వంతో విచారణ జరపనున్నారు. హీరాలాల్ నాయక్ ప్రస్తుతం డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీడీగా విధులు నిర్వహిస్తున్నారు.

యార్డులో మిర్చి రైతుల ఆందోళన

- ఒకవైపు మిర్చి ధర పతనం... మరో వైపు వ్యాపారుల మోసం
- కడుపు మండి రోడెక్కిన రైతన్నలు
- తగిన చర్యలు చేపట్టలేకపోతున్న మార్కెటింగ్ శాఖ అధికారులు



మిర్చియార్డులో ఆందోళన చేస్తున్న రాయలసీమ జిల్లాల రైతులు

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో రైతులు కుదేలౌతున్నారు. ఈ సీజన్ ప్రారంభం నుంచి మిర్చి ధర పతనం అయి నష్టాలు చవి చూస్తున్న రైతులకు కొంతమంది వ్యాపారస్థులు చేస్తున్న మోసాలతో ఆర్థికంగా చితికిపోతున్నారు. తమకు జరుగుతున్న నష్టంపై మార్కెటింగ్ శాఖకు నివేదిస్తున్నా ఏ ఫలితం లేకపోవడంతో కడుపు మండిన రైతులు మిర్చియార్డులోనే రోడ్డెక్కి ఆందోళనకు దిగుతున్నారు.

మంగళవారం రాయలసీమలోని కర్నూలు జిల్లా నుంచి వచ్చిన రైతుల వద్ద నుంచి మిరపకాయలను చాలా తక్కువ ధరకు వ్యాపారస్థులు నిర్ణయించ డంతో వారు ఆందోళనకు దిగారు. మరోవైపు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలోని గ్రంథసిరి నుంచి వచ్చిన రైతులు తమను ఇద్దరు కమీషన్ వ్యాపారులు నిలువునా మోసం చేసి రూ.50 లక్షలు ఎగ్గొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంగళవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, మంత్రాలయం తదితర ప్రాంతాల నుంచి రైతులు వివిధ రకాల మిర్చిని తీసుకొచ్చారు. మిర్చిని తీసుకొచ్చే ముందు సోమవారం ఇక్కడి కమీషన్ వ్యాపారస్థులకు ఫోన్లు చేస్తే మార్కెట్ రైజింగ్‌లో ఉన్నది. క్వింటాల్‌కు రూ. 14 వేల నుంచి రూ. 15 వేల ధర పడుతుందని చెప్పారు. దాంతో రైతులు మిర్చిని యార్డుకి తీసుకురాగా వ్యాపారస్థులు వాటిని చూసి రంగు బాగా లేదు, తాలు అధికంగా ఉన్నది, కాయ సైజు లేదు వంటి కారణాలు చెప్పి క్వింటాల్‌కు రూ. 12 వేలు మించి ధర రాదన్నారు. ఎన్నో వ్యయప్రయాసలు పడి తీసుకొచ్చిన మిర్చిని కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేసుకోలేక, తిరిగి వెనక్కు తీసుకెళ్లలేక వ్యాపారస్థులు నిర్ణయించిన ధరకు అమ్ముకోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 2023 సీజన్‌లో మిర్చికి క్వింటాల్ ధర రూ. 22 వేలకుపైగా ధర లభించింది. గత ఏడాది రూ. 18 వేల వరకు ధర చెల్లించారు. ఇప్పుడు కేవలం రూ. 12 వేలు మాత్రమే ఇస్తున్నారని ఆవేదన భరితమయ్యారు.

పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలోని గ్రంథసిరి గ్రామానికి చెందిన రైతులు కోటపాటి నాగేశ్వరరావు, రామకోటేశ్వరరావు, నరసింహారావు, పర్చూరి ప్రతాప్, కిలారి నాగేశ్వరరావు వచ్చి మిర్చియార్డు పరిపాలన భవనం ఎదుట ఆందోళనకు దిగారు. తమను మిర్చియార్డులో విజయ భాస్కర ట్రేడర్స్‌కు చెందిన గోపు శ్రీనివాసరెడ్డి, సంగెళ్ల కిషోర్‌రెడ్డి నిలువునా మోసం చేశారని వాపోయారు. మిర్చి అమ్మిన తాలుక పైకం తమకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షలు రావాలన్నారు. ఎన్నిసార్లు వెళ్లినా ఇవ్వకుండా రౌడీలతో దౌర్జన్యం చేయిస్తున్నారని చెప్పారు. దీనిపై తాము లాలాపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయితే విజయ భాస్కరట్రేడర్స్ లావాదేవీలు నిలిపేశామని అధికారులు చెబుతున్నారే తప్పా అతను వేరే ఫరం పేరుతో మిర్చి కొనుగోళ్లు చేస్తూనే ఉన్నారన్నారు.

ఆ సమయంలో అక్కడికి వచ్చిన మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రికకు ఫిర్యాదు చేయగా ఆమె తాను అన్ని పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. కాగా రైతులను మోసం చేసిన శ్రీనివాసరెడ్డి, కిషోర్‌రెడ్డిపై కేసులు నమోదు చేశామన్నారు. అలానే వాళ్లిద్దరూ వేరే ఫరంల ద్వారా చేసిన లావాదేవీలపై పూర్తి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశామన్నారు.

వెయిట్ లిఫ్టర్ నీలంరాజుకు ఎమ్మెల్యే జూలకంటి సత్కారం



నీలంరాజు, శివకేశవ్‌యాదవ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జనవరి 31న జరిగిన 38వ జాతీయ క్రీడల్లో మాచర్ల పట్టణానికి చెందిన హనుమాన్ వ్యాయామశాల వెయిట్ లిఫ్టర్ కొమెర నీలంరాజు గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం వెల్దుర్తిలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో వెయిట్ లిఫ్టర్ నీలంరాజు, కోచ్ రాచమంటి శివకేశవ్ యాదవ్‌లను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు ప్రాంత క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి, పులుసు రఘునాథరెడ్డి, హనుమాన్ వ్యాయామశాల కోచ్ రాచమంటి ఆదివిష్ణు యాదవ్, కొమెర శ్రీనివాసరావు, అనంతరాములు, వెయిట్ లిఫ్టర్ మంజుల అశోక్, మల్లికార్జునరావు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125.134.145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00



అవగాహన పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణం, డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

విజ్ఞాన్స్ - ష్నైడర్‌ల మధ్య ఎంవోయూ

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ బెంగళూరులోని ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని మంగళవారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. మంగళవారం విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ సుమతిసహగల్, వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్‌లు అవగాహన ఒప్పందపత్రాలు మార్చుకున్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో కె. మేఘన పాల్గొన్నారు.

1,45,429 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,43,421 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,45,429 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 75,679 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర	వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13600	334	9500	11500
నంబరు. 5	9500	13500	నంబరు. 5	--	–
273	10000	13000	273	–	–
341	10000	14000	341	–	–
4884	9000	11500	4884	–	–
సూపర్ 10	--	--	సూపర్ 10	--	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13800	తేజ	–	–
బ్యాడిగి	10000	13200	బ్యాడిగి	9500	9500
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	–	–
తాలుకాయలు	4500	7500	తాలుకాయలు	–	–

భయంతోనే జగన్ అసెంబ్లీకి రావడం లేదు

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ,ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): చేసిన తప్పులకు ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందో అన్న భయంతోనే మాజీ సీఎం జగన్ అసెంబ్లీకి రానంటున్నాడని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో విప్‌లు అందరితో అసెంబ్లీ సమావేశాల సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో జీవీ మాట్లాడుతూ ప్రభుత్వ పని తీరు, ప్రజా సమస్యల గురించి మాట్లాడేందుకు అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉండాలన్న కనీస విషయాన్ని కూడా మరిచిపోయి మాజీ సీఎం జగన్ వ్యవహరిస్తున్నారని, ప్రజాస్వామ్యం అంటే అతడికి ఉన్న చిన్న చూపు ఉందన్నారు. ఈనెల 22, 23 తేదీలలో ఎమ్మెల్యేల కోసం అవగాహన సదస్సు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. అవగాహన సదస్సులకు ముందు రోజు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, తర్వాతరోజు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరవుతున్నారన్నారు. సభా గౌరవ మర్యాదలు పెంచేలా ఈసారి సమావేశాలు ఉంటాయన్నారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

● వేమవరం రిజర్వు ఫారెస్టు నుంచి వచ్చిన దుప్పిపిల్ల

దాచేపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేమవరం రిజర్వ్ ఫారెస్టు నుంచి దారి తప్పి గ్రామం లోకి వచ్చిన చుక్కల దుప్పి గ్రామంలోని కుక్కలు దాడి చేయటంతో మృతి చెందింది. మంగళవారం అటవీశాఖ అధికారులు, పశువైద్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేమవరం రిజర్వ్ ఫారెస్టు నుంచి సంవత్సరంన్నర వయస్సు కలిగిన చుక్కల దుప్పి దారి తప్పి మంగళ వారం తెల్లవారుజామున గ్రామం లోకి వచ్చింది. దుప్పి పిల్లను గమనించిన కుక్కల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయప రచటంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు మృతి చెందిన దుప్పికి దాచేపల్లి పశువైద్యులు నార్ల చెన్నయ్యతో పోస్టుమార్టం నిర్వహించారు. డీఆర్‌వో విజయ లక్ష్మి, వేమవరం ఫారెస్టు బీట్ అధికారి బిక్కల వెంకటేశ్వరరావు దుప్పి కళేబరాన్ని స్వాధీనపరచుకున్నారు.



కుక్కల దాడిలో చనిపోయిన దుప్పి

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్రస్థాయి సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు బుధవారం స్థానిక జేబీ గార్డెన్స్‌లో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సాయి సమావేశం ఉదయం 9గంటల నుంచి జరుగుతుందని అసోసియేషన్ నియోజకవర్గ నాయకులు ఎం శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి సీపీఐ నాయకుడు, అసోషియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, తిరుపతయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. సమావేశానికి అగ్రిగోల్డ్ బాధితులు హాజరుకావాలని కోరారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలించిన డీఎస్పీ


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ జగదీష్

దుర్గి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన జరగనున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురజాల డీఎస్పీ జగదీష్ స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లోని ఎన్నికల బూత్‌ను పరిశీలించారు. గతంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కారంపూడి సీఐ శ్రీనివాసరావు, దుర్గి ఎస్‌ఐ సుధీర్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

అచ్చంపేట మండలంలో..

అచ్చంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పట్టభద్రుల ఓట్లు 1481 ఉన్నాయి. వీటికి అచ్చంపేటలో రెండు, తాడువాయిలో ఒకటి, మొత్తం మూడు పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం తహసీల్దార్‌తో పాటు సీఐ వెంకటప్రసాదు, అచ్చంపేట, తాడువాయి బూత్‌లను పరిశీలించారు. అచ్చంపేటలోని 334వ పోలింగ్ కేంద్రంలో 672 ఓట్లు, 335వ కేంద్రంలో 667 ఓట్లు, తాడువాయిలోని 336వ కేంద్రంలో 142 ఓట్లు ఉన్నట్టు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో శేషయ్యకు ప్రథమ బహుమతి


ప్రథమ బహుమతి సాధించిన కె.శివరామ శేషయ్య

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో పోలీసు ట్రైనింగ్ సెంటర్లో 8వ తేదీన జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తెనపల్లికి చెందిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు కే శివరామ శేషయ్య 60 సంవత్సరాల విభాగంలో వంద మీటర్లు, రెండు వందల మీటర్లు, నాలుగు వందల మీటర్ల పరుగు పందాల్లో ప్రథమ స్థానం సాధించాడు. మార్చి 4, 5, 6, 7 తేదీల్లో బెంగళూరులో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

మహిళా హక్కులపై అవగాహన సదస్సు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని 16వ వార్డు చెంచుకాలనీలో మహిళా హక్కుల సంక్షేమ అభివృద్ధిపై అవగాహన సదస్సు జరిగింది. రిసోర్స్ సెంటర్ ప్రతినిధులు హేమలత, మల్లెల చిన్నప్ప, మేడే వెంకటరమణలు మహిళా హక్కుల కోసం ఉన్న చట్టాలను వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న పలు పథకాల గురించి వివరించారు. అవగాహన కార్యక్రమంలో చెంచు, బుడగ జంగాల, యానాది కాలనీలకు చెందిన మహిళలతో పాటు పినపాటి ఈశ్వరి, తిరుపతి క్రిష్టియానమ్మ, బేబి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

● మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల భద్రతపై పాఠశాల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా అన్నారు. మంగళవారం మండలంలోని విజయపురిసౌత్ బాలయోగి గురుకుల పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలోని సీసీ కెమెరాల పర్యవేక్షణపై ఆరా తీశారు. విద్యార్థినుల వసతులపై ప్రిన్సిపాల్ మేరి మంజులను అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేనిదే బయటి వ్యక్తులను పాఠశాలలోకి అనుమతించవద్దని సూచించారు. సీఐ వెంట విజయపురిసౌత్ ఎస్‌ఐ షఫి, సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పోలూరి నరసింహారావు పరిశీలించారు. రహదారుల వెంట చెత్తాచెదారం తొలగింపు, సైడు కాలువల్లో పూడికతీత పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు ఉన్నారు.

రేషన్ పంపిణీ తనిఖీ

క్రోసూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగవరం, గుడిపాడు గ్రామాల్లో మంగళవారం తహసీల్దార్ వీవీ నాగరాజు పౌరసరఫరాల పంపిణీని తనిఖీ చేశారు. ప్రతినెల పంపిణీ జరుగుతుందా? లేదా? అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ పంపిణీ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెజారిటీయే లక్ష్యంగా ఆలపాటి గెలుపునకు కృషి చేయాలి

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి ప్రభుత్వం బలపరిచిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అధిక మెజారిటీ సాధించే విధంగా గురజాల నియోజకవర్గ కూటమి శ్రేణులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక శుభమస్తు కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ ఎన్నికపై నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. తొలుత ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో ఆలపాటి గెలుపు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంతో పాటు పల్నాడు ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ప్రతి 30 మంది పట్టభద్రుల ఓటర్లకు ఒక ఇన్‌చార్జ్‌ని ఏర్పాటు చేసుకొని ప్రతిరోజు వారి పరిధిలో 30 మంది ఓటర్లను కలుసుకునే విధంగా కమిటీలు వేసుకోవాలని సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రతిరోజు ఇన్‌చార్జ్‌లతో సమీక్ష నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో మండలాల్లో తాను కూడా పర్యటిస్తానన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని, దావోస్ పర్యటనతో రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనేక మంది పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు సీఆర్ రాజన్, కళ్లం రాజశేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి గెలుపుకు ప్రతి పట్టభద్రుడితో పాటు పార్టీ శ్రేణులు కూడా శ్రమించాలన్నారు. యరపతినేని తనయుడు నిఖిల్ మాట్లాడుతూ గెలుపుకన్నా మెజారిటీయే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, కర్నాటి వరలక్ష్మి, పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, కనిగిరి శ్రీను, బడిగుంచల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ భద్రి, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, మందా డేవిడ్, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, ఎల్‌వీఆర్, సయ్యద్ అమీర్ అలి, పోటు నాగేశ్వరరావు, చావా రామారావు, నేలవల్లి బొల్లయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్


ఆలపాటికి ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయ నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే అనుభవం ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి ప్రతి ఒక్కరు మద్దతు తెలపాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం ఉదయం మునగోడు, మల్లాది, లింగాపురం, మండెపూడి గ్రామాల్లోని హైస్కూళ్లలో పర్యటించి ఆలపాటికి మద్దతుగా తన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ హనుమంతరావు, టీడీపీ నాయకులు కె.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ వరప్రసాదు, ఆంజనేయులు తదితరులు

ఆలపాటిని గెలిపించండి : వరప్రసాదు

పెదకూరపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాదుకు ఓటు వేసి గెలిపించాలని జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వరప్రసాదు అన్నారు. మండలంలోని గారపాడు, లగడపాడు గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాదు మాట్లాడుతూ రాజేంద్రప్రసాదును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, తెలుగురైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి భాష్యం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

17న మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక ఈ నెల 17న ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ పీ శ్రీధర్ మంగళవారం తెలిపారు. వైస్ చైర్మన్ ఎన్నిక 17వ తేదీన జరిపేందుకు ఎన్నికల కమిషనర్ ఆదేశాలు అందాయని, ఎన్నికల ప్రత్యేక అధికారిగా గురజాల ఆర్‌డీవో వీ మురళీకృష్ణను నియమిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు. కాగా ఈ నెల 3వ తేదీన వైస్‌చైర్మన్ ఎన్నికకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా ఫారం-ఏ, బీ సకాలంలో అందజేయలేకపోవడంతో 4వ తేదీకి వాయిదా పడింది. 4వ తేదీన కోరం లేక మరలా వాయిదాపడిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు తిరిగి ఈ నెల 17న జరిపేందుకు ఎన్నికల కమిషనర్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కమిషనర్ తెలిపారు.

తండ్రి దుర్భాషలాడాడని కుమార్తె ఆత్మహత్య

గురజాలటౌన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తండ్రి దుర్భాషలాడాడని కుమార్తె ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని జంగమహేశ్వరపురంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బత్తుల పావని (19) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కాగా ఆమె తండ్రి అంకారావు మద్యం మత్తులో పావనిని దుర్భాషలాడడంతో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కలెక్టర్, ఎస్పీ పరిశీలన


నకరికల్లు జడ్పీ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఎస్పీ కే శ్రీనివాసరావు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల ఎనిమిది పోలింగ్ కేంద్రాలను మంగళవారం రాత్రి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కే శ్రీనివాసరావులు తమ సిబ్బందితో కలసి పరిశీలించారు. సత్తెనపల్లి ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కలెక్టర్‌కు వివరించారు. వారి వెంట తహసీల్దార్ చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ షమ్మి, డీఎస్పీ హనుమంతరావు, సీఐలు బ్రహ్మయ్య, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

● **రాజుపాలెం (ఆంధ్రజ్యోతి):** రాజుపాలెంలో ఉన్న మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను మంగళవారం రాత్రి కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్‌బూత్‌ల దగ్గర మరుగుదొడ్లు సౌకర్యాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్‌బూత్‌లను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారి వెంట సంబంధిత అధికారులు తదితరులున్నారు.

● **నకరికల్లు (ఆంధ్రజ్యోతి) :** నకరికల్లు జడ్పీ హైస్కూల్లోని 352, 353 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్, ఎస్పీ పరిశీలించి పట్టభద్రుల ఓటర్లకు ఇబ్బంది లేకుండా ర్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట, సత్తెనపల్లి ఆర్డీవోలు మధులత, రమాకాంత్ రెడ్డి, తహసీల్దార్ కే పుల్లారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మంటలు

● డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు సురక్షితం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఆకస్మికంగా మంటలు వచ్చాయి. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో 15 మంది ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ సంఘటన క్రోసూరు రోడ్డులో గల తురకపాలెం బస్టాప్ వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగింది. గుంటూరు నుంచి అమరావతి మీదుగా క్రోసూరు వెళ్తున్న గుంటూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తురకపాలెం వద్దకు రాగానే డ్రైవర్ ప్రక్కనే ఉన్న రేడియేటర్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో డ్రైవర్ వీఎస్ నారాయణ బస్సును నిలిపివేశాడు. వెంటనే కిందకు దూకాడు. ప్రయాణికులు కూడా బస్సులో నుంచి దిగిపోయారు. సమీప కుటుంబాల వారు బకెట్లతో నీరుతెచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. డ్రైవర్ సీటు, విద్యుత్‌వైర్లు, ఇంజన్ బాగం, ముందు అద్దాలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న క్రోసూరు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని బస్సులో పూర్తిగా నీటిని చల్లారు. మంటలు రావడానికి పాతకాలపు బస్సు, గుంతల మయంగా ఉన్న క్రోసూరు- అమరావతి రోడ్డు కూడా కారణమై ఉంటుందని పలువురు ప్రయాణికులు చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో టెనెక్ట్‌ప్లస్ ఇంజక్షన్లు


గురజాల ప్రభుత్వ వైద్యశాలలో స్టెమీ-గుండెకు భరోసా కార్యక్రమం ప్రారంభిస్తున్న వైద్యులు, కూటమి నేతలు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో టెనెక్ట్‌ప్లస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యశాల సూపరింటెండెంట్ ఉదయభాను తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ గుండెపోటుతో వైద్యశాలకు వచ్చే రోగుల ప్రాణాలను కాపాడేందుకు ఈ ఇంజక్షన్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఇంజక్షన్లను ఉచితంగా అందిస్తోందని చెప్పారు. ప్రజలు అత్యవసర సమయంలో ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూపరింటెండెంట్ ఉదయభాను కోరారు.

● **గురజాలటౌన్ (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం స్టెమీ-గుండెకు భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దీని ద్వారా గుండెపోటుతో సంభవించే మరణాలను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

● **సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి):** స్థానిక ఏరియా వైద్యశాలలో మంగళవారం స్టెమీ ప్రోగ్రాంపై వైద్యశాలకు వచ్చిన రోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ 50 సంవత్సరాలు పైబడిన వారిలో వచ్చే గుండె జబ్బులు ఇప్పుడు చిన్నారులను కలవర పెడుతున్నాయన్నారు. రెండు గంటలలోపు బాధితులకు టెనెక్ట్‌ప్లస్ ఇంజక్షన్ చేస్తే కోలుకుంటారన్నారు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం రూ.45వేలు ఖరీదు గల ఇంజక్షన్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా స్టెమీకి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, హెడ్ నర్సు బంగారుపాప, సిబ్బంది పాల్గొన్నారు.

● **పెదకూరపాడు (ఆంధ్రజ్యోతి):** గుండె పోటుకు భరోసా స్టెమీ ఇంజక్షన్ అని పెదకూరపాడు సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ విద్య అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో ఇంజక్షన్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు భరత్, రమేష్, జాన్ కోస్, వెంకటేశ్వరరావు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

స్థలం వివాదంలో దాడి.. ఒకరి మృతి

పెదకూరపాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : స్థలం విషయమై జరిగిన గొడవలో వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకూరపాడులో మంగళవారం రాత్రి జరిగింది. ఏఎస్‌ఐ రాజానాయక్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కర్రి రామ్మోహనరావుకు, బత్తుల రత్తయ్య, అప్పయ్యలకు స్థల విషయమై గొడవ జరిగిందని రత్తయ్య, అప్పయ్యలు రామ్మోహనరావును కాళ్లతో తన్నుతూ కొట్టారు. దీంతో స్పృహ కోల్పోయి చనిపోయాడని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ ఎం హనుమంతరావు, సీఐ సురేష్, ఎస్‌ఐ అల్లూరిరెడ్డిలు పరిశీలించారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణోత్సవం


మూల విరాట్‌ల వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

బెల్లంకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ యాదవకాలనీలో ఉన్న లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, సతీమణి లావణ్య అమ్మవారి కళ్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముత్యాల తలంబ్రాలు సమర్పణ

లక్ష్మీ తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, అక్కల వెంకట రామిరెడ్డి, గుడిసె కొండయ్య, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, ఎన్ పిచ్చయ్య, తెల్లమేకల నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గణపవరంలోని ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

గణపవరం ఆలయంలో కన్నా ప్రత్యేక పూజలు

రాజుపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో కొలువైయున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాగంణంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఉన్న జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులతో సమావేశమై రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని గెలిపించాలని కోరారు.

● **మాచవరం (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మాచవరం, వేమవరం గ్రామాల్లో మంగళవారం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

విద్యార్థులు నైతిక విలువలను అలవర్చుకోవాలి

● మెట్టు గోవిందరెడ్డి

రెంటచింతల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే నైతిక ఆధ్యాత్మిక విలువలను అలవర్చుకోవాలని శ్రీరామకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి కోరారు. మంగళవారం తుమ్మకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామకృష్ణ మిషన్‌ను స్థాపించి 125 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శౌరిరెడ్డి, విశ్రాంత ఎంఈవో గంధ్రకోట వెంకటేశ్వరరావు, ప్రసాద్, సేవాసమితి అధ్యక్షుడు రామయ్య, శ్రీనివాసరావు, పల్నూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని గెలిపించాలి : కన్నా లక్ష్మీనారాయణ


ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదును గెలిపించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కోరారు. మండలంలోని రామకృష్ణాపురం గురుకుల పాఠశాల, కేంద్రీయ విద్యాలయం, ఏజీఎం డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులతో, ఫైర్‌స్టేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, గ్రాడ్యుయేట్లు అందరూ మొదటి ప్రాధాన్య ఓటును కూటమి బలపరిచిన ఆలపాటి రాజాకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రచారంలో నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్, నాయకులు ఆళ్ల అమరేశ్వరరావు, నూర్‌బాషా జాన్‌బాబు, మక్కపాటి రామచంద్రరరావు, కే శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసే విధానం ప్రక్రియను ఓటరుకు వివరించాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానం ప్రక్రియను ప్రతి ఓటరుకు కూటమి నేతలు వివరించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో ఎమ్మెల్సీ ఎన్నికలపై పట్టణ, రూరల్ మండల కూటమి నేతలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పూజల వెంకటకోటయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ 30 మంది ఓటర్లకు బాధ్యులుగా నియమితులైన ప్రతిఒక్కరు ఓటర్లను కలసి మొదటి ప్రాధాన్య ఓటును ఆలపాటికి వేసేలా చూడాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజవర్గ పరిశీలకుడు వేములకొండ శ్రీనివాస్, నాయకులు ఆళ్ల అమరేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరరావు, ఆళ్ల సాంబయ్య, ఆతుకూరి నాగేశ్వరరావు, మన్నవ శారదాదేవి, తురగ మేరీ గ్రేస్, గోగినేని కోటేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

● జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి సంజీవ్‌కుమార్


విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి సంజీవ్‌కుమార్

మాచర్లటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు డ్రైవింగ్ సమయంలో రహదారి భద్రతా నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి జీ సంజీవ్‌కుమార్ అన్నారు. 36 వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎంవీఐ శేషురెడ్డి ఆధ్వర్యాన పట్టణంలోని కేసీపీ ఆడిటోరియం, సత్యసాయి విద్యా విహార్, న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డ్రైవింగ్ సమయంలో వాహనదారులు ఏకాగ్రత పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కేసీపీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, విశ్రాంత ఆర్టీవో విజయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్నాటి తిరుమల తిరునాళ్లను విజయవంతం చేయాలి

● ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి


దేవరంపాడు కొండపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి

రాజుపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పల్నాటి తిరుమలగా పేరుగాంచిన దేవరంపాడు కొండపై ఉన్న శ్రీనేతి వెంకన్నస్వామి తిరునాళ్ల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి కోరారు. మంగళవారం శ్రీనేతి వెంకన్నస్వామి ఆలయంలో తిరునాళ్ల విజయవంతంపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో తిరునాళ్లను విజయవంతం చేయాలన్నారు. మార్చి ఒకటిన జరుగనున్న ఈ తిరునాళ్లకు ఎక్కువ మంది భక్తులు వస్తారని దానిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, చలువ పందిళ్లు, తదితర ఏర్పాట్లు చేయాలని ఈవో సురేష్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ జానీబాషా తదితరులు ఉన్నారు.

తాగునీటి చెరువుపై వాకింగ్ ట్రాక్ అభివృద్ధి


చెరువుపై వాకింగ్ ట్రాక్ ప్రారంభిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ తదితరులు

పెదకూరపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని తాగునీటి చెరువుపై వాటింగ్ ట్రాక్ పనులను త్వరగా పూర్తయ్యేలా చూడాలని టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ అన్నారు. తాగునీటి చెరువుపై మంగళవారం రూ.8 లక్షల మండల పరిషత్ నిధులతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఉన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మండల నేతలు మద్దినేని వెంకట సత్యనారాయణ, మక్కెన సాగర్, నెల్లూరి మల్లికర్జున్ తదితరులు పాల్గొన్నారు.


పని చేయని ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటాం

● నీటి యాజమాన్య సంస్థ పీడీ సిద్ధ లింగమూర్తి


పశువుల షెడ్లను పరిశీలిస్తున్న నీటి యాజమాన్య సంస్థ పీడీ సిద్ధ లింగమూర్తి

పెదకూరపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పని చేయని ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సిద్ధ లింగమూర్తి అన్నారు. మండలంలోని లగడపాడు, గారపాడు గ్రామాల్లో పశువుల షెడ్లు, సీసీ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ నీటిని నిల్వ చేసే పనులను చేయాలని, పూర్తి కాని మినీ గోకులాలను త్వరగా పూర్తి చేయాలని టెక్నికల్ అసిస్టెంట్లకు, జేఈలకు సూచించారు. ఆయన వెంట క్లస్టర్ ఇన్‌చార్జ్ ఏపీడీ నారాయణ తదితరులు ఉన్నారు.

ఎత్తిపోతలపై.. నిర్లక్ష్యం



నాగులేటి పైతీరాన నిర్మించిన ఎత్తిపోతల పథకం మోటార్ల గది


ఎత్తిపోతల పథకానికి నీరందించేందుకు నాగులేటిలో నిర్మించిన బావి

ఆ గ్రామానికి చెంతనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది.. గ్రామంలో ఎత్తిపోతల పథకమూ ఉంది.. అయితే పైపులైన్ల మరమ్మతులతో గ్రామానికి తాగు, సాగు నీరు అందకుండా పోతోంది.. సుమారు రూ. 3.85 కోట్లతో నిర్మించిన పథకం ఏళ్ల తరబడి వినియోగానికి నోచుకోక మూలనపడింది.. గుత్తేదారు అలసత్వం, అధికారుల పర్యవేక్షణ లోపం, పాలకుల నిర్లక్ష్యంతో ఈ పథకం అభాసుపాలవుతోంది.. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి రాజకీయ నేతల వాగ్దానాలతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయే తప్ప నేతల హామీలు మాత్రం నెరవేరడం లేదు.

- రూ. 3.85 కోట్లతో నిర్మాణం
- లీకుల రిపేరుతో వినియోగంలోకి
- నిరుపయోగంగా మోటార్లు
- ప్రశ్నార్థకంగా 1255 ఎకరాలకు సాగునీరు

కారంపూడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కారంపూడి మండలం పేటసన్నిగండ్ల గ్రామంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. సాధారణంగా గ్రామ రైతులు నీటి బోరుల కింద పంటలు సాగు చేస్తారు. వరి, మిర్చిని ఇక్కడి రైతులు ప్రధానంగా సాగు చేస్తుంటారు. ఉదాహరణకు అక్కడ ఒక పొలంలో సుమారు 500 అడుగుల లోతులో బోరు వేస్తే నీరు పడింది అనుకోండి. పక్క పొలం రైతు 600 అడుగులు బోరు వేస్తే 500 అడుగులు వేసిన బోరు ఎండిపోతోంది. అదే ఇంకో రైతు 700 అడుగులు బోరు వేస్తే, ఇంతకు ముందు వేసిన బోర్లు ఎండిపోతాయి. ఇలా సాగునీటి కోసం రైతులు పెచ్చు అడుగుల మేర డ్రిల్లింగ్ చేస్తుండడంతో ముందుగా బోరు ఏర్పాటు చేసుకున్న పొలాలకు నీరు రాకుండా పోతోంది. దీంతో రైతులకు పంట సాగు ప్రశ్నార్థకంగా మారింది.

సుమారు రూ. 3.85 కోట్లతో..

రైతుల పరిస్థితి ఇలా ఉండడంతో 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసింది. ఇందుకు కోసం సుమారు రూ. 3.85 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి లక్ష్మారెడ్డి ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. గుత్తేదారు నాగులేటి పైభాగాన పథకం పనులకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం నాగులేటి పైభాగాన మోటార్ల గది, బావి ఏర్పాటు చేశారు. బావిలో నుంచి పైపులైన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా పొలాలకు నీరందేలా ఏర్పాటు చేశారు. 2007 నుంచి సాగిన ఈ పనులు 2011కు పూర్తయ్యాయి. పథకం పూర్తికాగానే సాగునీటిని విడుదల చేశారు. ఈ పథకం బాధ్యతను ప్రభుత్వం చిన్న తరహా నీటి పారుదల శాఖకు అప్పగించింది. ఈ పథకం కింద 1255 ఎకరాల దాకా సాగు కానుంది. అయితే ఒక్క ఏడాదిపాటు కూడా ఈ పథకం సత్ఫలితాలు ఇవ్వలేదు.


ముళ్ల పొదల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

టీడీపీ ప్రభుత్వ హయాంలో..

అయితే పథకం పూర్తయిన ఏడాదిలోపే పైపులైన్లు లీకేజీలకు గురయ్యాయి. దీంతో చివరి భూములకు చుక్క నీరు కూడా అందే పరిస్థితి లేకపోయింది. క్రమేణా లీకేజీలు ఎక్కువవడంతో పరిస్థితి మొదటకు వచ్చింది. కాగా 2014లో టీడీపీ అధికారం చేపట్టడంతో రైతులు తమ దయనీయ స్థితిని పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం స్పందించి పైపులైన్ల లీకేజీల మరమ్మతులకు రూ. 4.85 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే గుత్తేదారు లీకేజీల మరమ్మతుల పనులు చేపట్టకుండా తప్పుకున్నాడు. దీనిపై రైతులు చిన్న తరహ నీటి పారుదల శాఖ అధికారులకు విన్నవించుకోగా మీరంతా సంఘంగా ఏర్పడి సమస్యను పరిష్కరించుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు. అయితే సంఘం ఏర్పడింది లేదు.. సమస్య పరిష్కారమైందీ లేదు. అయితే అధికారులు మాత్రం ప్రతి ఏటా వచ్చి పథకం పూర్తి చేస్తామని కబుర్లు చెప్పి వెళ్లిపోతున్నారు. ఈ పథకం కాలక్రమేణా చిన్న తరహ నీరు పారుదల శాఖ నుంచి ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోకి వెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పాలకులు సైతం ఈ పథకం వినియోగంలోకి తీసుకొస్తామని హామీలు ఇస్తున్నారే గానీ అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని వినియోగంలోకి తీసుకొస్తుందని ఇక్కడ రైతాంగం కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

పదేళ్లుగా ఎదురుచూపు



గ్రామంలోని ఎత్తిపోతల పథకం వినియోగంలోకి వస్తుందని పదేళ్లుగా ఎదురుచూస్తున్నాం. కోట్ల రూపాయలతో నిర్మించిన పథకం యేడాదికే మూలనపడింది. ఈ పథకం కింద 1255 ఎకరాలు సాగవుతుంది. లీకేజీల మరమ్మతులకు నిధులు మంజూరైనప్పటికీ పనులు పూర్తి కాక పోవడం దురదృష్టకరం.

చావా వీరాంజనేయులు, రైతు, పేటసన్నిగండ్ల

నీరందించి పంటలకు ప్రాణం పోయాలి



ఈ ప్రాంతంలో వరి, మిర్చి అధికంగా సాగవుతుంది. సరైన సమయంలో వర్షం పడితే తప్ప పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. గ్రామంలోనే ఎత్తిపోతల పథకం ఉన్నప్పటికీ సాగునీరు అందడం లేదు. పాలకులు, అధికారులు సమస్యను పరిష్కరించి పొలాలకు నీరందించి పంటలకు ప్రాణం పోయాలి.

గాడిపర్తి పూర్ణయ్య, రైతు, పేటసన్నిగండ్ల

నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం

ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏఈ వెంకటయ్య

ఎత్తిపోతల పథకానికి సంబంధించి పైపులైను లీకేజీల సమస్య ఏర్పడింది. లీకేజీల మరమ్మతులకు గతంలో నిధులు మంజూరైనప్పటికీ పనులు పూర్తి కాలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే మరమ్మతు పనులు ప్రారంభిస్తాం.

బతుకు పోరాటం...


జానెడు పొట్ట నింపుకోవటం కోసం మురుగులో నిలబడి చెత్తలో ప్లాస్టిక్ బాటిళ్లను ఏరుకుంటున్న దృశ్యం
-గుంటూరు, ఆంధ్రజ్యోతి

రసవత్తరంగా సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ

- ఉత్కంఠ పోరులో ఏపీ-తెలంగాణపై తమిళనాడు విజయం
- మరో మ్యాచ్‌లో కేరళపై కర్ణాటక గెలుపు


పోటీల్లో తలపడుతున్న ఏపీ-తెలంగాణ, తమిళనాడు జట్లు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ప్రిన్సిపల్ ఎకౌంటెంట్ జనరల్ కార్యాలయం నేతృత్వంలో ఇండియన్ ఆడిట్స్, ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ఐఏ అండ్ ఏడీ సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంటు రసవత్తరంగా సాగుతుంది. టోర్నీలో భాగంగా రెండో రోజు జరిగిన రెండు మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఏపీ-తెలంగాణ రాష్ట్రాల జట్టు, తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఏపీ-తెలంగాణ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. యశ్ కొఠారి 57 బంతుల్లో 77, తరుణ్ 27 పరుగులు చేయగా, తమిళనాడు బౌలర్లు అశ్విన్ బాలాజీ, రవితేజ డీబీ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అశ్వత్ శ్రీధర్ 3 ఓవర్లలో కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చి స్కోరును కట్టడి చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు 18 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. ఆఖరి రెండు ఓవర్లలో 27 పరుగులు చేయవలసి వుండగా, 19 ఓవర్‌లో కేవలం 4 పరుగులు మాత్రమే వచ్చాయి. దీంతో చివరి ఆరు బంతుల్లో 23 పరుగులు చేయాల్సి వుండగా, ఏపీ-తెలంగాణ జట్టు గెలుపు ఖాయమని అంతా భావించారు. అయితే, తమిళనాడు బ్యాటర్ ఫ్రాన్సిస్ రోకిన్స్ వరుసగా రెండు సిక్సర్లు బాది, మూడో బంతికి అవుటయ్యాడు. 3 బంతుల్లో 11 పరుగులు చేయాల్సి వుండగా, బ్యాటింగ్‌కు దిగిన విఘ్నేష్ ఒక్క పరుగు తీసి వేదాంత్ భరద్వాజ్‌కు స్ట్రైకింగ్ ఇచ్చాడు. భరద్వాజ్ చివరి రెండు బంతులను వరుసగా ఫోరు, సిక్సు బాదడంతో ఉత్కంఠ పోరులో తమిళనాడు విజేతగా నిలిచింది.

కర్ణాటక, కేరళ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో కర్ణాటక టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. కేరళ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 127 పరుగులు చేసింది. కేరళ బ్యాటర్లు సచిన్ 29, శ్యాంసన్ 24 పరుగులు చేయగా, కర్ణాటక బౌలర్లు దర్శన్ 3, అర్జున్ గౌడ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 8 వికెట్ల తేడాతో ఘనవిజయం నమోదు చేసింది. కర్ణాటక బ్యాటర్లు అభిరాత్ రెడ్డి 37 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 50 పరుగులు, అర్జున్ హోయసాలా 25 బంతుల్లో 41 పరుగులు చేశారు. కేరళ బౌలర్లు మణికృష్ణన్, మిథులు చెరో వికెట్ పడగొట్టారు. రెండు మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను సీనియర్ డిప్యూటీ ఎకౌంటెంట్ జనరల్స్ భాస్కర్ కల్లూరు, కిశోర్‌రెడ్డి, ఆర్.శ్యామ్, రాకేష్ నాయక్, ఎన్.నిఖిలలు అభినందించారు. కాగా, బుధవారం ఉదయం కేరళ, తమిళనాడు, మధ్యాహ్నం ఏపీ-తెలంగాణ, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగనున్నాయి.

పీజీఆర్‌ఎస్‌లో మెరుగుపడిన
గుంటూరు జిల్లా పనితీరు

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్(పీజీఆర్‌ఎస్)లో గుంటూరు జిల్లా పనితీరు మెరుగుపడింది. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సెక్రెటరీలతో సీఎం, మంత్రులు నిర్వహించిన సమీక్ష అనంతరం స్కోర్లను విడుదల చేశారు. ఇతర జిల్లాలతో పోల్చితే ప్రతి సోమవారం వచ్చే గ్రీవెన్స్‌లను చాలావరకు అధికారులు తగ్గించగలిగారు. వాటి పరిష్కారం విషయంలో 20 మార్కులకు 19.91 స్కోరుని జిల్లా సాధించింది. అలానే గ్రీవెన్స్‌ల పరిష్కారం నాణ్యతతో స్కోర్ కాస్త తగ్గింది. 13.35గా ప్రభుత్వం ప్రకటించింది. వీఐపీ క్లోజర్ రేట్ స్కోరు 20కి 20గా ఉన్నది. అయితే వీఐపీ క్వాలిటీ స్కోరు మాత్రం 9.93గా ఉన్నది. కాగా చాలా పిటీషన్లను వీఆర్‌వోలకు పంపుతున్నారు. వీఆర్‌వోలు పంపే రిపోర్టు ఆధారంగా అధికారులు వాటిని అప్‌లోడింగ్ చేసేస్తున్నారు. ఎవరూ కూడా నేరుగా వెళ్లి పిటీషన్లను కలవడం లేదు. సుపీరియర్ అధికారుల్లో కనీసం తహసీల్దార్ స్థాయి అధికారి కూడా వ్యక్తిగత ఎంక్వయిరీ నిర్వహించడం లేదని ప్రభుత్వం పేర్కొన్నది. ఆర్‌వోఆర్ కేసుల్లో ఆఫీసర్లు ఎండార్స్‌మెంట్‌లు అప్‌లోడింగ్ చేస్తూ పిటీషనర్‌కి ఆర్‌వోఆర్ కేసుని కాంపిటెంట్ అథారిటీ ఎదుట ఫైల్ చేయాలని సూచిస్తున్నారు. ప్రాథమిక ఎంక్వయిరీ నిర్వహించడం లేదు. ఈ నేపథ్యంలో అధికారులు తప్పనిసరిగా ఎంక్వయిరీ నిర్వహించి సమగ్ర నివేదికని కాంపిటెంట్ అథారిటీకి పంపాలని ఆదేశించింది. కొన్ని కేసుల్లో పిటీషనర్ల పేర్లను వెబ్‌ల్యాండ్‌లోనే మాయం చేస్తున్నారు. దాంతో పిటీషనర్ హైకోర్టులో కేసులు దాఖలు చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు చాలా మంది ఎలాంటి విచారణ చేయకుండానే హైకోర్టు ఆదేశానుసారం సమస్య పరిష్కరిస్తామనణ చెబుతున్నారు. గతంలో నీటి వనరుల్లో అసైన్‌మెంట్ పట్టాలు జారీ చేశారు. అలానే వాటికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి వెబ్‌ల్యాండ్‌లో కూడా ఎక్కించారు. రీసర్వే సమయంలో భూవినియోగం ప్రొసీడింగ్స్ అందుబాటులో లేదని పేర్కొంటూ పేర్లు తొలగించారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురైన కేసుల్లో చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామంటున్నారే తప్పా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వీటన్నింటిని సరి చేసుకోవాలని సూచించింది.

నేటి నుంచి మూడు రైళ్ల రద్దు

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వేస్టేషన్‌లో కొత్త ప్లాట్‌ఫాం నిర్మాణం కారణంగా ఈ నెల 12వ తేదీ నుంచి మార్చి 13వ తేదీ వరకు 30 రోజుల పాటు మూడు రైళ్లను రద్దు చేస్తున్నామని డీఆర్ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 67221 విజయవాడ - తెనాలి, 67231 తెనాలి - రేపల్లె, 67332 రేపల్లె - తెనాలి రైళ్లను రద్దు చేస్తున్నామన్నారు. నంబరు. 67224 రేపల్లె - తెనాలి రైలుని ఆయా తేదీల్లో 60 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేయడం జరుగుతుందన్నారు.

అమరావతికి హడ్కో రుణం

- రూ.11 వేల కోట్లు మంజూరు
- ఇప్పటికే ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల అప్పు
- త్వరలో కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు హడ్కో రూ.11 వేల కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. హడ్కో జాయింట్ జనరల్ మేనేజర్(జేజేఎం) ఎస్ఎం శ్రీనివాస్, జేజేఎం(ప్రాజెక్ట్స్) కె.విజయకుమార్ మంగళవారం విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబును కలిసి రుణ మంజూరు పత్రాలను అందించారు. రుణపత్రాలను స్వీకరించినప్పటి నుంచి నాలుగు నెలల్లో లోన్ అగ్రిమెంట్ వ్యవహారాలను పూర్తి చేసుకోవాలని హడ్కో ప్రతినిధులు కమిషనర్‌కు చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఐఏఎస్, ఏపీఎన్‌జీవో, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్లు, ప్రిన్సిపల్ సెక్రటరీ బంగ్లాలు, జడ్జీల క్వార్టర్లు, గవర్నమెంట్ టైప్-1, 2 భవనాలు, ప్రధాన రోడ్ల పునర్నిర్మాణ పనులు, హ్యాపీనెస్ట్, సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయాల పునర్నిర్మాణాలు, ఎల్‌పీఎస్ జోన్లలో మౌలిక సదుపాయాల కల్పన పనులు, ట్రంక్ ఇన్‌ఫ్రా పనులు, అమరావతి వరద నియంత్రణ పనులు తదితర అనేక ముఖ్యమైన పనులకు టెండర్లు పిలిచేందుకు సీఆర్‌డీఏ, ఏడీసీ సిద్ధమయ్యాయి.ఈ క్రమంలో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.31 వేల కోట్ల రుణాన్ని పొందేందుకు సీఆర్‌డీఏ ప్రయత్నాలు చేసింది. ఇప్పటికే ప్రపంచ బ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల రుణం మంజూరైంది. ఆ పత్రాలు కూడా సీఆర్‌డీఏకు అందాయి. ఇదే సందర్భంలో హడ్కో నుంచి రూ.11 వేల కోట్ల రుణం, జర్మనీకి చెందిన డెవలప్‌మెంట్ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్ల రుణం పొందేందుకు ప్రయత్నాలు చేపట్టారు. హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ కూడా రుణం ఇవ్వటానికి మౌఖికంగా అంగీకరించాయి.

ముగిసిన ఎడ్ల బలప్రదర్శన పోటీలు

సీనియర్స్ విభాగంలో వేటపాలెం ఎడ్లు ప్రథమ స్థానం

మాచవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడులో శ్రీలక్ష్మీనరసింహాస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు మంగళవారంతో ముగిశాయి. సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా పెదకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన సుంకు సురేందర్‌రెడ్డి కంబైన్డ్ జత రెండో స్థానంలో, నంద్యాల జిల్లా గుంపుమాందిన్నె గ్రామానికి చెందిన కుందూరు రామ్‌భూపాల్‌రెడ్డి ఎడ్లు మూడో స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా ఇనిమెట్ల గ్రామానికి చెందిన కటకం లక్ష్మణ్ కుమార్ కంబైన్డ్ జత ఐదో స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులతో పాటు షీల్డ్‌లు బహూకరించారు.

జూనియర్స్ విభాగంలో బాపట్ల ఎడ్లు ప్రథమ స్థానం

జూనియర్స్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణచౌదరి ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. హైదరాబాద్‌కి చెందిన డీ రోహన్‌బాబు ఎడ్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. పెదనందిపాడు మండలం నాగులపాడుకి చెందిన ఆలా మోహనరావు, పాటిబండ్ల శ్రీనివాసరావు కంబైన్డ్ జత నాల్గో స్థానంలో, లింగాయపాలేనికి యల్లం సాంబశివరావు ఎడ్లు ఐదో స్థానంలో, కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం నాదెండ్లవారిపాలేనికి చెందిన కాకర్ల సురేష్‌బాబు ఎడ్లు ఆరో స్థానంలో, నరసరావుపేట మండలం పమిడిమర్రుకి చెందిన ఎర్రసాని సుబ్బయ్య ఎడ్లు ఏడో స్థానంలో నిలిచాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కృష్ణా జిల్లా పెనుమత్స గ్రామానికి చెందిన సూరపనేని రాధాకృష్ణ, దుర్గికి దుగ్గి శ్రీనివాసరావు వ్యవహరించారు.


గెలుపొందిన యజమానులకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

మండలి బరిలో.. 30 మంది

(5వ పేజీ తరువాయి)

కనకం శ్రీనివాసరావు, యెంద్రెడ్డి శివారెడ్డి, గుడిశ రాంబాబు, బోట్ల శివసత్యన్నారాయణ, గుణుకుల వెంకటేశ్వర్లు, గౌతుకట్ల అంకమ్మరావు, డేగల సైదారాజు, కందుల వెంకటరావు, చుండూరు సత్యబాలసుందర రామశర్మ, లగడపాటి వేణుగోపాల్, జూపూడి శ్యాంప్రసాద్, మంత్రి బాలకృష్ణ, మేరిగ మోహనరావు, మురకొండ చంద్రశేఖర్, గంటా మమత, గుమ్మా శ్రీనివాసరావు, షేక్ ఉమర్‌బాషా, తిరువీధుల శారద, వై వినయ్‌కుమార్ తంబి, గంగోలు శామ్యూల్, షేక్ అహ్మద్, ఆరిగల శివరాంప్రసాద్, ఎం రామకోటయ్య, డీ విక్రం, వై శోభారాణి, దుక్కిపాటి రాధాకృష్ణమూర్తి, అన్నవరపు ఆనంద కిషోర్, పులుగు దీపక్ నామినేషన్లను ఆమోదించారు. ఓటర్ల జాబితాలో పేర్లు సరిపోలకపోవడం తదితర కారణాలతో షేక్ కరిముల్లా, చిలక వెంకయ్య, లింగం జాన్‌బెన్నీ, పీఎస్‌వీఎన్ హరికిషన్, వరగాని ఏడుకొండలు, అంబల్ల రాజకుమార్, బసవ వంశీకృష్ణ, జాలాది అనీల్‌కుమార్, పప్పూరి వెంకటఅశోక్ నామినేషన్లను తిరస్కరించారు. ఎవరెవరి అభ్యర్థిత్వాలను ఆమోదించింది, తిరస్కరించింది, అందుకు కారణాలను పేర్కొంటూ ప్రొసీడింగ్స్‌ని ఆర్‌వో జారీ చేశారు.

రేపటి వరకు ఉపసంహరణ గడువు

కాగా నామినేషన్ల ఉపసంహరణకు గడవు సమయం ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉన్నది. ఆ తర్వాత తుది అభ్యర్థుల జాబితాని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రూపొందించి విడుదల చేస్తారు. ఆ వెంటనే బ్యాలెట్ పేపర్ ముద్రణ ప్రక్రియని చేపడతారు. నామినేషన్ల పరిశీలనలో జేసీ భార్గవతేజ, ఏఆర్‌వో షేక్ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ తేదీ సమీపిస్తున్నందున ఓటర్లకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల అధికారులను ఆర్‌వో నాగలక్ష్మి ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై పల్నాడు, బాపట్ల, ఎన్‌టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో మంగళవారం సాయంత్రం ఆమె గుంటూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌వో మాట్లాడుతూ సాధారణ ఎన్నికలతో పోల్చితే ఎమ్మెల్సీ ఓటింగ్ భిన్నంగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లకు తమ ఓటుని ఎలా వేయాలి అనే దానిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణపై పీవో, ఏపీవో, ఓపీఓలకు ఈ వారంలో శిక్షణ నిర్వహిస్తామన్నారు.

విచ్చలవిడి.. వినియోగం

(5వ పేజీ తరువాయి)

ఏ మాత్రం తేడా రాదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యూరియా, సూపర్ పాస్పేట్, ఎం.ఓ.పి, డీఏపీ, 20:20:0, 28:28:0, 14:35:14, 10:26:26 తదితర ఎరువులతో కలిపి పోషకాల సిఫార్సును బట్టి వేయాలి. అంతేగాక రైతులు కాంప్లెక్స్ ఎరువులను పై పాటుగా విత్తిన, నాటిన నెల తర్వాత కూడా వేస్తున్నారని అధికారులు తెలిపారు. దీనివల్ల కాంప్లెక్స్ ఎరువులోని భాస్వరం పంటకు ఏమాత్రం ఉపయోగపడకపోగా జింకు, ఇనుము ఇతర పోషకాలతో కలిసి నేలలో స్థిరీకరింపబడి వాటిని కూడా మొక్కలకు అందకుండా చేస్తుందంటున్నారు.

సూచనలు పాటించాలి



ఎరువులు ఎక్కువగా వాడటం వల్ల నష్టం తప్ప లాభం లేదు. ఈ విషయంలో రైతులు కచ్చితంగా వ్యవసాయ శాఖ సూచనలు, సలహాలు పాటిస్తే మేలు జరుగుతుంది. రబీలో వరి, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటలకు తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వేయాలి. ఎరువుల వాడకం పెరిగిపోతే భూమి తన సహజగుణం కోల్పోతుంది. ఎరువుల వాడకం కచ్చితంగా తగ్గించాలి.

-నున్న వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి, గుంటూరు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఉప్పలపాడులో పాత కక్షతో దాడి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ఇద్దరు ఇనుప రాడ్డుతో దాడిచేశారు. బాధితుడు అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలపాడు చెందిన కందుకూరి వెంకయ్య, అతని కుమారుడు పవన్ తనపై పాత కక్షల నేపథ్యంలో రాడ్‌తో దాడి చేసినట్టు చెప్పాడు. ఈ ఘటన మంగళ వారం నరసరావుపేట మండలం ఉప్పలపాడులో చోటుచేసుకుంది. తీవ్రగాయాలైన క్షతగాత్రుడికి నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్సచేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించాలని స్థానిక డాక్టర్లు చెప్పారు. గొడవపై విచారణ చేస్తు న్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

నేడు పట్టణానికి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ రాక

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి), సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేడు పట్టణా నికి రానున్నారు. నరసరావుపేట న్యాయవాద సంఘ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన సీని యర్ న్యాయవాది హైకోర్టు డిజిగ్నేటెడ్ సీని యర్ కౌన్సిల్ జీఎల్‌వీ రమణమూర్తికి నిర్వ హించనున్న గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఆయనతో పాటు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపా సాగర్ కూడా పాల్గొననున్నారు.

ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌లో జేడీ, ఏడీ తనిఖీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు లింగంగుంట్ల లోని 200 పడకల ప్రభుత్వ వైద్యశాలలోని బ్లడ్ బ్యాంకును మంగళవారం ఏపీ సాక్స్ బీటీఎస్ విభాగ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న, అసిస్టెంట్ డైరెక్టర్ వి బాబురావులు తనిఖీ చేశారు. బ్లడ్ బ్యాంక్‌లోని సాంకేతిక సిబ్బం దిని వివిధ అంశాలపై ప్రశ్నించారు. వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ ఉండగా వైద్యశాలలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆవశ్యకత ఏమిటంటూ ప్రశ్నిం చారు. ప్రైవేట్ బ్లడ్ బ్యాంకులవారు నిర్వ హించే క్యాంపులలో సేకరించే బ్లడ్ ప్యాకె ట్లలో 30% ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుం ది. ఆ విధంగా చేస్తున్నారా లేదా, ప్రభుత్వ వైద్యశాలలోని వివిధ గ్రూపుల రక్తం లభ్యత తదితర అంశాలపై విచారించారు. కాగా తనిఖీ అనంతరం విలేకరులతో మాట్లాడడా నికి వారు సుముఖత వ్యక్తం చేయలేదు. ఆమె వెంట ప్రభుత్వ వైద్యశాల సూపరింటెం డెంట్ డాక్టర్ బీవీ రంగారావు డాక్టర్ ఏడు కొండలు ఇతర సిబ్బంది ఉన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి), పట్టణంలోని ప్రభుత్వ వైద్య శాలలోని ప్రసూతి విభాగంలోని గర్భిణులకు మంగళవారం పట్టణంలోని మూడో వార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పౌష్టికా హారా న్ని పంపిణీ చేశారు. కోడిగుడ్లు, పాలు, తది తర పదార్థాలను పంపిణీ చేశారు. కార్యక్ర మం లో వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ ఎల్.వెంకటేశ్వరరెడ్డి, వైద్యశాల సూప రింటెండెంట్ డాక్టర్ బీవీ రంగారావు, డాక్టర్ ఎస్.రాంప్రసాద్, టీడీపీ కార్యకర్తలు పాల్గొ న్నారు.

కళాకారులకు పింఛన్లు ఇప్పించరూ: మందా

వినుకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): క ళాకారులకు పింఛన్లు, ఉపాధితోపాటు నాటక ప్రదర్శనకు అవకాశం కల్పించాలని రాష్ట్ర సాంఘీక, సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామికి పలువురు విజ్ఞప్తి చేశారు. జీవనజ్యోతి స్వచ్ఛంద సంస్థ వ్యవ స్థాపకుడు మందా వెంకట్రావు, కార్యవర్గ స భ్యులు మంగళవారం మంత్రిని కలిసి ఈ విజ్ఞప్తి చేశారు. ముందుగా ఎన్‌టీఆర్ చిత్రప టాన్ని మంత్రికి బహూకరించారు. ఈ సంద ర్భంగా మంత్రి కళాకారులను అన్ని విధా లుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

ఎన్ఈసీలో ముగిసిన జుబ్లియేషన్ 2కే25

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఈసీ కళా శాలలో నిర్వహిస్తున్న జుబ్లియేషన్ 2కే25 సాంకేతిక సాంస్కృతిక, క్రీడా ఉత్సవాల ముగింపు వేడుకలు మంగళవారం నిర్వహిం చినట్లు కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్ర వర్తి తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి గా జేఎన్టీయూ నరసరావుపేట ఫిజికల్ డైరె క్టర్ డాక్టర్ జీపీ రాజు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వ రరావులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలలో విజేతలైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు మిట్టపల్లి రమేష్, మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభమైన ఏఎఫ్‌డీ

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఆరు రోజుల పాటు అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ నెల 10వ తేదీ కార్యక్రమం ప్రారంభించినట్లు ఆ యన తెలిపారు. నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికే షన్స్ అనే అంశంపై ఆరు రోజుల శిక్షణ కార్య క్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వివి ధ కళాశాలకు చెందిన 200మందికి పైగా అధ్యాపకులు పాల్గొంటున్నట్లు ఆయన తెలి పారు. జేఎన్‌టీయూకు చెందిన డాక్టర్ జెట్టి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల కార్యదర్శి రావెల సత్యనారాయణ, ఈసీఈ విభాగ అధిపతి జగదీష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నేతల ప్రచారం

ఈపూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి బలపరిచిన అభ్యర్థికి ప్రథమ ఓటువేసి విజ యానికి సహకరించాలని టీడీపీ జిల్లా అధి కార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. మంగళవారం మండలంలోని పట్టభద్రులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ బి.రామయ్య, ఎ.కోటేశ్వరరావు, నర్రా కిశోర్, బి.సైదులు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో వసతులు కల్పించాలి

● అధికారులకు కలెక్టర్, ఎస్పీ ఆదేశం

నరసరావుపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పోలింగ్ కోసం ఎంపిక చేసిన పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు అవసరమైన అన్ని వస తులు కల్పించాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ లను ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలసి కలెక్టర్ పరిశీలించారు. పట్టభద్రుల ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ర్యాంపుల ఏర్పాటు.. నిరంతర విద్యుత్.. తాగునీటి వసతిని కల్పించాని సూచిం చారు. క్యూలైన్లను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ సమయంలో ఓటర్లు ఎండ తీవ్రతకు గురికాకుండా ఉండేలా టెంట్లు ఏర్పాటు చేయా లన్నారు. ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న



నరసరావుపేటలోని మునిసిపల్ స్కూల్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు

ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌లలో కల్పించాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీ లించి తగు సూచనలను అందజేశారు. అనం తరం సత్తెనపల్లిలోని బాలికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం, ముప్పాళ్ళ మండలంలోని జిల్లా పరిషత్ స్కూల్, రాజుపాలెం, నకరికల్లులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ అరుణ్‌బాబు పరిశీ లించారు. కార్యక్రమంలో నరసరావుపేట రెవెన్యూ డివిజన్ అధికారి మధులత సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి రమాకాంత్ రెడ్డి, అయా మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్లతో పారదర్శకంగా పథకాల అమలు

● జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళి

శావల్యాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయపరమైన అన్ని పథకాలను పారదర్శకంగా అందజేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రే షన్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, రైతులంతా తప్ప కుండా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని జిల్లా వ్యవసా యశాఖాధికారి ఇంగిరాల మురళి తెలిపారు. ఈ-క్రాప్ బుకింగ్ సూపర్ చెక్ రికార్డుల తనిఖీలలో భాగంగా మంగళవారం ఆయన శావల్యాపురానికి వచ్చారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 146మంది రైతులు సాగుచేసిన పంటలకు, ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదైన పంటలకు వ్యత్యాసాలున్నాయని వాటిలో కొన్ని రికార్డులను డీఏవో పరిశీలించి మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. అనంతరం శావల్యాపురం సచివాల యాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు తీవ్రమైన అన్యాయం జరుగు తుందని, రైతులు మిల్లర్ల దగ్గరకు ధాన్యాన్ని చేరవేశాక తేమశాతం ఎక్కువగా ఉందని తరుగుకోసం నాలుగు లేక ఐదు కేజీలను మినహాయించుకుంటున్నారని రైతులు డీఏవో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై డీఏవో మాట్లాడుతూ తేమశాతం 17కంటే తక్కువ ఉంటేనే ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కాబట్టి రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి మిల్లర్ల దగ్గరకు తీసుకు వెళ్లాలన్నారు.

గతంలో వ్యవసాయ యంత్ర పరికరాలను రాయితీ లపై రైతులకు అందించే వారిని, కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతు గ్రూపులకు అందజేశా రని, వారు రైతులకు అద్దెకివ్వకుండా సొంతానికి వాడుకున్నారని విలేకరులు డీఏవో దృష్టికి తీసుకె ళ్లగా యంత్ర పరికరాలకు 60శాతం పెట్టుబడి రైతు గ్రూపులవారే పెట్టారని, వారు అద్దెకిచ్చి వచ్చిన రుసుముతోనే రుణాలకు కిస్తీలు కట్టాల న్నారు. మండలంలో యూరియా కొరత ఉందని, బహిరంగ మార్కెట్‌లో రూ.350లకు యూరియాను విక్రయిస్తున్నారని విలేకరులు తెలుపగా ప్రభుత్వం వద్ద యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, వెంటనే రైతు సేవాకేంద్రాలకు అందజేస్తామన్నారు. కారుమంచి సొసైటీ పరిధిలోని వయ్యకల్లు వద్ద ఏర్పా టుచేసిన వ్యవసాయ గోడౌన్‌లో ఎరువుల విక్రయాలు జరగడం లేదని, ఎప్పుడూ మూతవేసి ఉంటుందని విలేకరులు తెలుపగా డీసీవోతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం డీఏవో మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 12వేల హెక్టార్‌లలో రైతులు మొక్క జొన్న పంటను సాగుచేశారని, ప్రస్తుతం మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో




శావల్యాపురంలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న డీఏవో మురళి

9700 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిం దని, కందిసాగును బట్టి జిల్లాలో అవసరమైనచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ప్రభుత్వ మద్దతు ధర రూ.7520లకు కందులు కొనుగోలు చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ప్రతి మండలానికి 3డ్రోన్ లను 80శాతం రాయితీపై రైతు గ్రూపులకు అందిం చేలా ప్రణాళికలు సిద్ధం చేసిందని, డ్రోన్ ఆపరేటర్‌గా వ్యవహరించేందుకు గ్రూపు సభ్యుల్లో ఒకరైనా ఇంటర్ పైన విద్యార్హతను కలిగి ఉండాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 51 గ్రూపులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించామని, త్వరలో వారికి డ్రోన్‌లు అందజేస్తామ న్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు, ఏఈవో పి.అశోక, వీఏఏలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణ వేడుకలు

శావల్యాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరు పంచాయతీ పరిధిలోని గంటవారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి దేవాలయంలో అమ్మవారి కల్యాణ వేడుకలను మంగళవారం వైభ వంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యతో తరలివచ్చి గోపయ్య, లక్ష్మీతిరుపతమ్మ, మావిరాల ఎల్లమ్మ విగ్రహాలకు క్షీరాభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అర్చనలు, అభి షేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లకు చీరె సారెలను కానుకగా సమర్పిం చారు. అనంతరం 16మంది దంపతులు పీటలమీద కూర్చొని గోపయ్య, లక్ష్మీ తిరుపత మ్మల ఉత్సవ విగ్రహాలకు మేళతాళలతో అంగరంగ వైభవంగా కల్యాణాన్ని జరిపిం చారు. అనంతరం పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మ కర్త గోనుగుంట్ల వెంకట్రావు, కమిటీ సభ్యులు కలసి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● పాలపాడు (నరసరావుపేట రూరల్): మండలంలోని పాలపాడులో గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణం మంగళవారం కన్నుల పండువగా జరిగింది. పాలపాడులోని గోపయ్య సమేత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం 25 వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామి వార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల్లో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. అనం తరం ఆలయంలో అమ్మవారి కల్యాణం కన్నుల పండుగగా జరిగింది. కల్యాణంను చూసేందుకు పాలపాడుతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. అనం తరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎక్కంటి సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు గాది పెద్ది రెడ్డి, కొలిశెట్టి బాబు, మెట్టు జగన్నాధరెడ్డి, ఎల మంచలి ధర్మారవు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యలు

నేడు రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల బొడ్రాయి సమీపంలోని లక్ష్మీ తిరుప తమ్మ తల్లి కల్యాణోత్సవం నేడు నిర్వహించనున్నట్లు భక్త బృందం మంగళవారం తెలి పింది. ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమి రోజు కల్యాణం నిర్వహించటం ఆనవా యితీ. అనంతరం అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శిం చుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నష్టం

● ఎంప్లాయిస్, టీచర్ల జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగు లకు నష్టం కల్గించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిందని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్ల జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నరసరావుపేట పట్ట ణంలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ 2008 నుంచి అమలు అవుతున్న మినిమం టైమ్ స్కేల్‌ను అమలు కాదంటూ జీవో నంబరు2 ఇచ్చార న్నారు. లక్షా 20వేల మంది పనిచేస్తున్న అవు ట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆప్కాస్ రద్దుచేసి, ప్రైవేట్ కాంట్రాక్టర్ల ద్వారా నియమిస్తామని క్యాబినెట్ నిర్ణయించడాన్ని ఖండిస్తున్నామ న్నారు. ప్రైవేటు కాంట్రాక్టర్లకు ఇవ్వడం అంటే పాతకాల అటవిక కాలానికి తీసుకెళ్ళడమే అన్నారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లు ఉన్నప్పుడు జీతాలు సక్రమంగా నెలనెల ఇచ్చేవారు కాద న్నారు. పీఎఫ్ వందల కోట్లు రూపాయలు ఎగ గొట్టిన పరిస్థితి ఉందన్నారు. ఈఎస్ఐ సక్ర మంగా అమలు కాకపోవటం వల్ల చనిపో యినా, అనారోగ్యానికి గురైనా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఇది రెండు లక్షల 40వేల మందికి అన్యాయం చేయడమే అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచిం చాలని, ఆప్కాస్ రద్దు చేసే ఆలోచన విరమిం చాలని డిమాండ్ చేశారు. అప్కాస్‌ను విర మించే ప్రయత్నం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సమస్యల మీద నిరంతం పనిచేస్తూ, మాకు మద్దతు తెలియ జేస్తూ, మాతో పోరాడుతూ అరెస్టయిన పీడీ ఎఫ్ అభ్యర్థులు ఎవరైతే ఉన్నారో వాళ్లని ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలిపించమని విజ్ఞప్తి చేశారు. కృష్ణా - గుంటూరు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి కేఎస్ లక్ష్మణరావు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు సంబంధించి డీవీ రాఘవులు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విజయ గౌరిలకు ఎమ్మెల్సీ ఎన్నికలలో మద్దతు తెలియ జేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహమ్మద్ మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో పూర్తిమద్దతు ఇస్తున్నామన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరి, శ్రామిక మహిళా సంఘం నాయకురాలు డీ శివకుమారి, ఎస్.ఆంజనేయ నాయక్, కట్టా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలల ప్రతిష్ఠ పెంచేలా ఫలితాలు రావాలి: జేడీ

నాదెండ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలల ప్రతిష్ఠ పెంచేలా ఫలితాలు సాధించా లని ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ తహేర సుల్తాన్ అన్నారు. మండలంలోని చిరుమా మిళ్ళ ఏపీ మోడల్ స్కూల్‌లో మంగళవారం పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన 15 ఏపీ మోడల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు విద్యా ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ 10వ తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మోడల్ పాఠశాల విద్యార్థులు అగ్రగామిగా నిలిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. నాణ్యా మైన పోషకాహారం అందించాలని, సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావే శంలో స్థానిక ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలి: డీడీఏ

వినుకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెంలో మంగళవారం పొలం పి లుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డీఆర్‌సీ డీడీఏ ఎంశివకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి, కంది, మిరప, పొగాకు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా పంటలను నమోదు చేయించుకోవాలన్నారు.అనంతరం మొక్క జొన్న పైరును పరిశీలించారు. పంటలకు సోకే చీడపీడలను నివారణ కోసం ఎలాంటి చర్యలు తీసు కోవాలో రైతులకు సుచించారు. కార్యక్రమంలో సునీత, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుండెపోటుకు రక్షణ ఇచ్చే ఇంజక్షన్లు సరఫరా

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలలో గుండెపోటు బారినపడిన వారికి రక్షణగా వెంటనే అందించే టెన్ క్లిప్టాస్ 40 ఎంజీ ఇంజక్షన్లను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసింది. గుండెపోటుకు గురై, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సుమారు రూ.45 వేలు విలువచేసే ఈ ఇంజ క్షన్ ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఆసుపత్రి ఇన్‌చార్జ్ మెడి కల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసరావు మంగళవారం తెలి పారు. గుండెపోటు మరణాలను తగ్గించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న స్టెమీ ప్రాజెక్టు సత్ఫలితాలు ఇస్తున్నదని డాక్టర్ బి ప్రశాంతి తెలిపారు. గుండెపోటు మరణాలను తగ్గించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమన్నారు. గుండెపోటుకు గురైన వారు గంటలోపే ఆసుపత్రికి రావాలన్నారు. గుండె నొప్పి, గుండె దడ, ఎడమవైపు భుజం లాగడం, ఛాతిలో నొప్పి, ఉన్నట్టుండి ఆయాసం పెరగటం, స్పృహ తప్పి పడిపోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు.

వాహనం అదుపు తప్పి విద్యార్థి మృతి

నాదెండ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో గుంటి రాజేష్ (20) అనే విద్యార్థి మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటన సాతులూరు - చందవరం గ్రామాల మధ్య ఉన్న కేవీఎం ఆర్గానిక్ కంపెనీకి సమీపంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చందవరం గ్రామానికి చెందిన గుంటి వసంతరావు పెద కుమారుడు రాజేష్ నరసరావుపేట పట్టణంలోని ఒక కళాశాలలో బీకామ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం స్కూటీపై తన స్నేహితుడితో కలసి చందవరం వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడింది. ఈ ఘటనలో ఆ యువ కుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.



గుంటి రాజేష్ (ఫైల్ ఫొటో)

ఆలపాటికి ప్రైవేటు ఉపాధ్యాయుల ఫోరం మద్దతు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో, ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు తమ మద్దతును ప్రక టిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఫోరం వ్యవస్థాపకుడు షేక్ జాఫర్ మంగళవారం పేర్కొన్నారు. స్థానిక ఒక విద్యాసంస్థలో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో జాఫర్ మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల, ఉపా ధ్యాయేతర సిబ్బంది సమస్యల పరిష్కారానికి తాము ఏన్నో సంవ త్సరాలుగా కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కువ శాతం ఓట్లు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు పోలయ్యేలా ప్రతి ఒక ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యా పకులు చూడాలని కోరారు. కూటమి ప్రభుత్వ నిర్వహించే డీఎస్సీ సన్నద్ధతపై ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు దృష్టి సారించా లన్నారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య: ఖమ్మంలో ఘటన

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భార్యను చంపి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. నరసరా వుపేటకు చెందిన నరసింహారావు (65), కోటమ్మ (58) దంపతులు ఆరేళ్లుగా ఖమ్మంలోని బ్యాంక్ కాలనీ సమీపంలోని వేణుగోపాలనగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. నరసింహారావు కొన్నేళ్లపాటు నగరంలోని పలు హోట ళ్లలో వంటమాస్టర్‌గా పని పనిచేశాడు. భార్య కోటమ్మ ఇంట్లోనే ఉంటుంది. అయితే గత కొన్ని నెలలుగా వారిద్దరికీ అనారోగ్య సమస్యలతో నరసింహారావు హోటల్ పనిమానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. అయితే సాయంత్రం ఫిల్టర్‌వా టర్ సరఫరా చేసే ఓ యువకుడు వారి ఇంటికి వచ్చి డోర్ కొట్టగా తీయలేదు. దీంతో కింది అంతస్థులో ఉంటున్న ఇంటి యజమాని వద్దకు వచ్చి విషయం చెప్పాడు. దీంతో ఇంటి యజమానితో పాటు పక్క పోర్షన్‌లో ఉంటున్న వారు పైకి వెళ్లి కిటికి నుంచి చూడగా నరసింహారావు రక్తపు మడుగులో కనిపిం చాడు. ఈ విషయం వెంటనే టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించ డంతో సీఐ బాలక్రిష్ణ సిబ్బందితో అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించింది.

సుప్రీం కోర్టు వ్యాఖ్యలు వైసీపీకి చెంపపెట్టు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నేరమయ రాజకీయాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం చేసిన తాజా వ్యాఖ్యలు అవినీతి, విద్వేష రాజకీ యాలను నమ్ముకున్న వైసీపీ వంటి పార్టీలకు చెంపపెట్టని స్థానిక శాసనస భ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఇక్కడ విలేకరులతో అన్నారు. క్రిమినల్ కేసులున్న వారు చట్టసభల్లో అడుగుపెట్టి, పరిపాలకులు అయితే ఎలాంటి ఉపద్రవాలు సంభవిస్తాయో చెప్పడానికి రాష్ట్రమే పెద్ద ఉదాహరణ అన్నారు. గడచిన ఐదేళ్లలో నేరమయ రాజకీయ నేపథ్యం ఉన్నవారి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఎంతటి నష్టాన్ని చవిచూసిందో, దాని ప్రభావం నుంచి నేటికీ బయటపడలేక ప్రజలు ఏవిధంగా బాధలు పడుతున్నారో చూస్తూనే ఉన్నా మన్నారు. అవినీతి, దోపిడీలకు పాల్పడటం, తమను ప్రశ్నించిన వారికి భూమి మీద స్థానం లేకుండా చేయడం, తమ నేరప్రవృత్తిని, దుర్మార్గాలను కప్పిపుచ్చుకోవడానికి పార్టీలు, వ్యక్తులపై ఎదురుదాడి చేయడం, దుష్ప్రచారం చేసి బురదజల్లడం వంటి నీతిమాలిన రాజకీయాలను ప్రజలు స్వయంగా చూశారని వివరించారు. కల్తీ నెయ్యి, అడవుల ఆక్రమణదారులు, మద్యం మాఫియా ఆగడాలు కూడా బయటకొస్తాయన్నారు.

కోటప్పకొండలో దేవదాయ శాఖ కమిషనర్ పరిశీలన

కోటప్పకొండ (నరసరావుపేట), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి సందర్భంగా కోటప్పకొండ శ్రీతికోటేశ్వరస్వామి సన్నిధిలో 26న జరగ నున్న తిరునాళ్ల ఏర్పాట్లను దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ మంగళవారం పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానంలో చేపడుతున్న ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగని రీతిలో ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు త్రికోటేశ్వరస్వామిని సులువుగా దర్శించుకునేలా క్యూ లైన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న క్యూ లైన్‌లను అయన పరిశీలించారు. తిరునాళ్ల ఏర్పాట్లకు సంబంధిం చిన నిధులు విడుదల చేయాలని ఈవో చంద్రశేఖరరావు కమిషనర్‌ను కోరారు. ఇందుకు అయన సానుకులంగా స్పందించారు. కమిషనర్ రామచం ద్రమోహన్ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈవో చంద్రశేఖరరావు అయనను అలయ లాంఛనాలతో ఘనంగా సత్కరిం చారు. కార్యక్రమంతో దేవదాయశాఖ ఉన్నతాధికారులు చంద్రకుమార్, కేబీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైట్లకు మరమ్మతులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్థానిక శాసనస భ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించిన నేపథ్యంలో స్థానిక మున్సిపల్ అధి కారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహ దారిపై ఏఎంజీ సంస్థ వద్ద నుంచి ఓగేరువాగు వంతెన వరకు, నరసరావు పేట రోడ్డు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు, కళామందిర్ సెంటర్, కస్తూ రిబా రోడ్డు, కోటప్పకొండ రోడ్డులలో ఉన్న సెంట్రల్ డివైడర్లపై ఉన్న లైట్లకు, గడియార స్తంభం లైట్లకు మరమ్మతులు చేస్తున్నామని మున్సిపల్ డీఈఈ అబ్దుల్ రహీం చెప్పారు. తిరునాళ్ల సందర్భంగా తాగునీటి సరఫరాకు ఇబ్బం దులు లేకుండా కూడా చర్యలు గైకొంటున్నట్టు ఆయన వివరించారు.



చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

ఈద్గా అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం: చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈద్గా అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఎన్నికలకు ముందే హామీ ఇచ్చిన మేరకు పెండింగ్‌లో ఉన్న అంశా లన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలిపారు. పట్టణంలోని తిమ్మాయి పాలెం రోడ్డులోని నవాజ్‌కుంట వద్ద ఉన్న ఈద్గా అభివృద్ధికి సంబంధించి స్థానిక మతపెద్దలు, మర్కస్‌మజిద్ ఏ అబూబకర్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జీవీని కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేయిస్తామని వారికి జీవీ హామీ ఇచ్చారు.

ఈ-శ్రమ పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలి

● వెలుగు ఏపీఎం వాసుబాబు

శావల్యాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగాలలోని కార్మికుల అభ్యున్నతి కోసం కేంద్ర పభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ పథకంపై వీవోఏలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సంఘస భ్యులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఏపీఎం వాసుబాబు మాట్లా డుతూ డ్వాక్రా మహిళలు తీసుకొన్న స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో పారదర్శక తను పెంచేందుకు ప్రభుత్వం మండలానికి 10పేటీఎం మిషన్‌లను అందజే సిందని గ్రామాలలో వీవోఏలు పేటీఎంల ద్వారా చెల్లింపులు చేయించుకొని వెంటనే వారికి రసీదులు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో వీవోఏల పనితీరును సీసీలు పర్యవేక్షణ చేయాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు భార్గవి, కార్యదర్శి కుమారి పాల్గొన్నారు.

ఆలపాటికి మద్దతుగా గ్రామాలలో టీడీపీ నాయకుల ప్రచారం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటువేసి గెలిపించాలని మంగళవారం మండల పరిధి లోని మురికిపూడి, పసుమర్రు గ్రామాలలో టీడీపీ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జె.మదన్మోహన్, ఎస్.సదాశి వరావు, ఎం.నరసింహారావు, నాగపూర్ణ చంద్రరావు, చౌదరి పాల్గొన్నారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు శరాబందిరావు మృతి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని నెహ్రూనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయుడిగా పనిచేసి 2006లో రిటైరైన మున్నంగి శరా బందిరావు (78) ఇక్కడి గాంధీపేటలోని ఆయన స్వగృ హంలో మంగళవారం కన్నుమూశారు. ఆయన రాష్ట్ర ఉపా ధ్యాయ సంఘం చిలకలూరిపేట పట్టణ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, జిల్లా కౌన్సిలర్‌గా పనిచేశారు. ఉపాధ్యా యులకు వారి సర్వీస్ విషయాల్లో విశేషసేవ చేశారు. ఆయ న మృతికి ఎస్టీయూ నాయకులు పోటు శ్రీనివాసరావు, మేకల కోటేశ్వరరావు, వడ్లాణ జయప్రకాష్, వినుకొండ అక్కయ్య తదితరులు సంతాపం తెలిపారు.



మున్నంగి శరాబందిరావు